



ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్పీ



6

లాంచి షికారు

నేటి నుంచి సోమశిల-శ్రీశైలం లాంచి ప్రారంభం



7

ఇల్లే నందనవనం

మిద్దెపై తోట ఏర్పాటు చేసిన ఉపాధ్యాయుడు



6

నీటి సంరక్షణలో భాగస్వాములు కావాలి

జలశక్తి అభియాన్ కేంద్ర బృందం శాస్త్రవేత్త



7

డీసీసీబీ అభివృద్ధే లక్ష్యం

చైర్మన్ మామిళ్లపల్లి విష్ణువర్ధన్‌రెడ్డి

అభయారణ్యం నుంచి.. జనంలోకి

- అడవిని వీడేందుకు సిద్ధమవుతున్న నల్లమల గిరిజనులు
- పులులు, ఇతర జంతు సంరక్షణ కోసం పునరావాస పథకం
- రూ.15 లక్షలు నగదు లేదా ఐదు ఎకరాల భూమి, ఇల్లు, వసతులు
- మొదటి దశలో 417 కుటుంబాల తరలింపు
- ఎలివేటెడ్ హైవే నిర్మాణానికీ ఉపయోగకరం

మహబూబ్‌నగర్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : నల్లమల అటవీప్రాంతంలో జంతు జనాభా పెరుగుతోంది. ముఖ్యంగా దేశంలోనే పులుల సంతతి ఎక్కువ పెరుగుతున్న ప్రాంతాల్లో అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ కూడా ఉన్నది. ఎన్‌టీసీపీఏ యాక్టు 2008 ప్రకారం పులులు సంచరించే ప్రాంతంలో ఎలాంటి జనావాసాలు ఉండటానికి వీల్లేదు. ఇప్పుడు పులుల సంఖ్య పెరుగుతున్న తరుణంలో అభయారణ్యంలో అడవిని నమ్ముకొని జీవినం కొనసాగిస్తున్న చెంచులు, ఇతరులకు ప్రాణసంకటంగా మారింది. జంతు జనాభా పెరుగుతుండటంతో అడవిలో సాగు చేసిన పంటలు కూడా దక్కడం లేదు. నిత్యం కాపలా ఉన్నా పంటలు చేతికి వచ్చే పరిస్థితి లేదు. అటు జంతు సంరక్షణతో పాటు.. ఇటు గిరిజనుల పునరావాసం కోసం ఎన్‌టీసీపీఏ (నేషనల్ టైగర్ కన్జర్వేషన్ అథారిటీ) అడుగులు వేయగా ఒకప్పుడు వ్యతిరేకించిన చెంచులు, ఇతరులు ఇప్పుడు మైదాన ప్రాంతాల్లో పునరావాసం కోసం సిద్ధమవుతున్నారు. ఇప్పటికే పునరావాసం కింద అర్హత పొందిన వారి జాబితా తయారు చేసిన అటవీ శాఖ అధికారులు వారికి రెండు ఆప్షన్లు చూపించారు. మొదటి ఆప్షన్ కింద 18 సంవత్సరాలు నిండిన వ్యక్తికి రూ. 15 లక్షలు టోకెన్ అమౌంట్.. రెండో ఆప్షన్ ఐదెకరాల భూమి, అన్ని వసతులు ఏర్పాటు చేసిన కాలనీలో ఇంటిని నిర్మించి ఇవ్వనున్నారు. మొదటి దశలో సార్లపల్లి, కుడిచింతల బైలు, తాటిగుండాల పెంట, కొల్లంపెంట గ్రామాల్లోని 417 కుటుంబాలను

- మిగతా 6వ పేజీలో..



పునరావాసంలో భాగంగా తరలించనున్న సార్లపల్లి గ్రామం



విష ప్రయోగంతో చనిపోయిన చిరుత పులి(ఫైల్)

మంచి జీవనం కోసం ఒప్పుకున్నాం



అమ్రాబాద్ మండలంలోని అన్ని గ్రామాల్లో గిరిజనేతరులకు రాజకీయంగా కానీ.. ఉద్యోగపరంగా కానీ ఎలాంటి హక్కులు లేవు. మా తాతాల తరం నుంచి పోడు భూములను సాగుచేస్తున్నా ఎటువంటి పట్టాలు రావు. వ్యవసాయం కూడా అడవిలో జంతువుల వల్ల చేయలేకపోతున్నాం. అందుకే మెరుగైన జీవనం. భూములపై హక్కు కోసం ఎన్‌టీసీపీ వారు ఇచ్చే పునరావాసం పొందడానికి అంగీకరించాను.

- పుణ్యమూర్తి విష్ణు, పునరావాస కమిటీ అధ్యక్షుడు, సార్లపల్లి

ఎన్నాళ్లీ అడవిలో బతుకులు



నల్లమల అటవీప్రాంతంలో జీవిస్తున్న చెంచులకు ప్రభుత్వపరంగా సరైన వైద్యం అందడం లేదు. రోగాల బారిన పడి చెంచులు 30 ఏళ్లకే కాటికిపోతున్నారు. కనీస అవసరాలకు సరిపడా వైద్యం కూడా లేదు. మేము ఇప్పటికీ అడవుల్లోనే బతుకుతున్నాం. పిల్లలకు చదువు సరిగా ఉండటం లేదు. ఇక్కడి నుంచి పోతే పిల్లల జీవితాలైనా బాగుపడతాయని స్వచ్ఛందంగా ముందుకు వస్తున్నాం.

- మండ్లి బౌరమ్మ, మాజీ సర్పంచు, కుడిచింతల బైలు

న్యూస్ బాక్స్

నేడు మద్దూర్‌కు సీఎం



కోస్గి/మద్దూరు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శనివారం మద్దూర్‌కు రానున్నారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు సతీష్ దశదినకర్మకు హాజరుకానున్నారు. ఈ సందర్భంగా ఎస్పీ యోగేష్ గౌతమ్ హెలిప్యాడ్, పార్కింగ్ స్థలాలను పరిశీలించారు. సీఎం కాన్వాయ్‌కు సెక్యురిటీపై సిబ్బందితో చర్చించారు.

భద్రతా బృందాలతో సమావేశం

సీఎం పర్యటన సందర్భంగా మద్దూర్‌లోని ఓ ఫంక్షన్ హాల్‌లో వివిధ భద్రతా బృందాలతో ఎస్పీ యోగేష్‌గౌతమ్ సమీక్ష చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో 350 మంది భద్రతా సిబ్బందితో పటిష్ట బందోబస్తు చర్యలు తీసుకుంటున్నామన్నారు. సీఎం ఉదయం 11:30 గంటలకు మద్దూర్‌కు చేరుకుంటారని చెప్పారు. 30 నిమిషాలు ఉండి, 12 గంటలకు తిరుగు ప్రయాణం అవుతారని చెప్పారు.

డాక్టర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

మహబూబ్‌నగర్(వైద్యవిభాగం) అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రభుత్వ వైద్య కళాశాలలో కాంట్రాక్టు పద్ధతిన ప్రొఫెసర్, అసోసియేట్, అసిస్టెంట్ ప్రొఫెసర్, ట్యూటర్లు, జూనియర్, సీనియర్ రెసిడెంట్ డాక్టర్ల పోస్టుల నియామకాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల డైరెక్టర్ డాక్టర్ రమేష్ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు ధ్రువపత్రాలతో ఈనెల 29న ఎదిరలోని తిరుమల హిల్స్‌లో గల కళాశాలలో ఇంటర్వ్యూలకు హాజరు కావాలని, పూర్తి వివరాలకు కళాశాల వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు.

విద్య, వైద్యంపై ప్రత్యేక దృష్టి

- ఐటీఐ చదివే విద్యార్థులకు ప్రపంచ స్థాయి శిక్షణ
- ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించడమే లక్ష్యం
- మహబూబ్‌నగర్‌లో సాంకేతిక భవన శంకుస్థాపనలో రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు



ఐటీఐ సాంకేతిక భవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు, చిత్రంలో ఎమ్మెల్యేలు జీఎంఆర్, శంకర్, యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, వాకిటి శ్రీహరి, కలెక్టర్ విజయేందిర బోయి

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం విద్య, వైద్యంపై ప్రత్యేక దృష్టి సారించిందని రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్‌బాబు అన్నారు. రాష్ట్రంలో మొత్తం 65 ఐటీఐలను అధునాతన శిక్షణా కేంద్రాలుగా మార్చలన్న లక్ష్యంతో భగీరథ ప్రయత్నం చేస్తున్నామని చెప్పారు. శుక్రవారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని బాలికల ఐటీఐ కళాశాల ఆవరణలో సమీకృత బాలురు, బాలికల అధునాతన సాంకేతిక కేంద్ర భవన(రూ.9.48 కోట్లు) నిర్మాణానికి ఎమ్మెల్యేలు యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, వాకిటి శ్రీహరి, శంకర్, కలెక్టర్ విజయేందిర బోయిలతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆలోచనతో పేద విద్యార్థులు చదువుతున్న ఐటీఐని ఇంటర్నేషనల్ స్థాయికి తేవడానికి ముందకు సాగుతున్నామన్నారు. దావోస్‌కు వెళ్లిన సమయంలో అక్కడ టాటా ప్రాజెక్ట్‌తో ఒప్పందం చేసుకున్నట్లు తెలిపారు. రూ.2,300 కోట్ల పెట్టుబడులతో ఐటీఐ చదివే గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ప్రపంచ స్థాయి శిక్షణ ఇవ్వాలని ఆచరణలోకి తెచ్చామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 65 ఐటీఐలను అధునాతన శిక్షణా కేంద్రాలుగా తీర్చిదిద్దనుండగా, మహబూబ్‌నగర్ జిల్లాకు మొదటి దఫాలోనే అడ్వాన్స్ ట్రైనింగ్ సెంటర్ మంజూరైందన్నారు. కళాశాలలో ఆరు కోర్సులు ప్రవేశపెట్టనున్నట్లు చెప్పారు. అచ్చంపేటలోనూ ఏటీసీ సెంటర్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. 65 కేంద్రాల్లో నవంబరు లేదా డిసెంబరులో కోర్సులు ప్రారంభం అవుతాయని తెలిపారు. గతం ప్రభుత్వ హయాంలో ఐటీఐలు కనీస అభివృద్ధికి నోచుకోలేదన్నారు. ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ పాలమూరును

- మిగతా 6వ పేజీలో..

ఎల్ఆర్ఎస్ పరిశీలన వేగవంతం

- నారాయణపేట జిల్లా టౌన్ ప్లానింగ్ అధికారి కిరణ్ కుమార్



ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

నారాయణపేట, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): నారాయణపేట జిల్లా వ్యాప్తంగా ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిశీలనను వేగవంతం చేసినట్లు జిల్లా టౌన్ ప్లానింగ్ అధికారి కిరణ్ కుమార్ తెలిపారు. శుక్రవారం ఆయన 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు. ఆ వివరాలు..

జిల్లాలో ఎన్ని బృందాలు పరిశీలన చేస్తున్నాయి?

జిల్లాలోని 280 గ్రామ పంచాయతీల్లో 265, కోస్గి, మక్తల్, నారాయణపేట మునిసిపాలిటీల్లో తొమ్మిది అధికారుల బృందాలు క్షేత్ర స్థాయిలో ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను పరిశీలన చేస్తున్నాయి.

క్షేత్రస్థాయి పరిశీలనలో ఏయే అధికారులు ఉంటారు?

క్షేత్ర స్థాయి పరిశీలనలో గ్రామాల్లో టెక్నికల్ అధికారిగా పంచాయతీ కార్యదర్శి, ఆర్ఐ, ఇరిగేషన్ ఏఈ ఉంటారు. మునిసిపాలిటీల్లో టౌన్‌ప్లానింగ్ సూపర్ వైజర్, ఆర్ఐ, ఇరిగేషన్ ఏఈ ఉంటారు.

ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు ఎన్ని వచ్చాయి? ఎన్ని పెండింగ్‌లో ఉన్నాయి?

జిల్లాలోని గ్రామ పంచాయతీలకు సంబంధించి 13,015 దరఖాస్తులు వచ్చాయి. 10,800 ప్రాసెస్‌లో ఉన్నాయి. 537 క్షేత్ర స్థాయిలో పరిశీలించి, ఆమోదించబడ్డాయి. 444 తిరస్కరణకు గురయ్యాయి. మునిసిపాలిటీల్లో నారాయణపేటలో 6,963 దరఖాస్తులు వచ్చాయి. 3,267 డ్యాక్యుమెంట్‌లలో లోపాలు ఉండగా, 1,555 అప్రూవల్ పొందాయి. మక్తల్‌లో 10,499 దరఖాస్తులకు 1,445లలో లోపాలు ఉన్నాయి. 2,450 అప్రూవల్ పొందగా, కోస్గిలో 3,909 దరఖాస్తులకు 2,400లలో లోపాలు ఉండగా, 715 అప్రూవల్ పొందాయి.

పరిశీలనలో ఏమైనా ఇబ్బందులు తలెత్తుతున్నాయా?

నెట్‌వర్క్ రాకపోవడం, సర్వర్ మొరాయించడం, మ్యాప్‌లో ఫొటోలు అప్‌లోడ్ కాకపోవడం వంటి సమస్యలు ఎదురవుతున్నాయి. పలుచోట్ల వ్యవసాయ భూములు ఉండటం, నీరు నిల్వడం ఉండటం వంటి సమస్యలు ఉన్నాయి.

పశుగణన ప్రారంభం



పశు గణన పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్, పశుసంవర్ధక శాఖ అధికారులు

నారాయణపేట, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): నారాయణపేట జిల్లాలో పశుగణన ప్రారంభమైంది. ఐదేళ్లకోసారి పశుసంవర్ధక శాఖ దేశ వ్యాప్తంగా పశు సంపదను లెక్కిస్తుంది. 2019లో పశు సంపదను లెక్కించారు. ప్రస్తుతం శుక్రవారం నుంచి ఫిబ్రవరి 28 2025 వరకు గణన చేపట్టనున్నారు. పశు సంవర్ధక శాఖ అధికారి బి.ఈశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో సిబ్బంది రైతుల ఇళ్లకు వెళ్లి సర్వే చేయనున్నారు. అందుకోసం జిల్లా వ్యాప్తంగా 37 మంది ఎన్యుమరేటర్లు, ఏడుగురు సూపర్‌వైజర్లను నియమించారు. జిల్లాలోని 13 మండలాల్లో గల 280 గ్రామ పంచాయతీలు, మూడు మునిసిపాలిటీల్లోని 55 వార్డులలో సిబ్బంది గణన చేపట్టనున్నారు. ఈ సారి డిజిటల్ విధానంలో గణన చేపడతారు. అందుకోసం జాతీయ స్థాయిలో ప్రత్యేకంగా ఒక అప్లికేషన్ రూపొందించారు. సిబ్బంది ప్రతీ ఇంటికి వెళ్లి పశువుల యజమానులు, పశువులు, వాటి పరికరాల వివరాలను యాప్‌లో పొందుపర్చనున్నారు. ఈ గణన ఆధారంగానే పశువులకు మందుల సరఫరా, పశుపోషణ ప్రభుత్వ పథకాల రూపకల్పన, పశుగ్రాస విత్తనాల పంపిణీ చేపట్టనున్నారు.

జిల్లాలో పశుసంపద ఇలా..

2019 లెక్కల ప్రకారం నారాయణపేట జిల్లాలో పశువులు 1,00,770 ఉన్నాయి. గేదెలు 50,210, గొర్రెలు 12,94,124, మేకలు 1,25,760, పందులు 11,614, కుక్కలు 8,647, కోళ్లు 4,56,298, బాతులు 120 ఉన్నాయి.

పోస్టర్ ఆవిష్కరణ

21వ అఖిల భారత పశుగణన ప్రారంభం సందర్భంగా శుక్రవారం నారాయణపేటలో కలెక్టర్ సిక్తా పట్నాయక్, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి ఈశ్వర్‌రెడ్డి వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పశుగణన కోసం ఇళ్లకు వచ్చే పశు సిబ్బందికి వివరాలు చెప్పాలన్నారు.

మంచినీళ్లు అనుకొని యాసిడ్ తాగిన వ్యక్తి మృతి

అచ్చంపేట టౌన్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : మద్యం మత్తులో మంచినీళ్లు అనుకొని యాసిడ్ తాగిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట మండల పరిధిలోని కిష్ట తండాలో చోటుచేసుకున్నది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన కేతావత్ భీక్య(40) మద్యానికి బానిసయ్యాడు. ఈ నెల 18న ఉదయం పనుల నిమిత్తం అతని భార్య అచ్చంపేటకు వెళ్ళగా ఇంట్లో ఒంటరిగా ఉన్న భీక్య మద్యం మత్తులో మంచినీళ్లు అనుకొని యాసిడ్ తాగాడు. అతడి అరుపులువిని సోదరుడు వచ్చి చూశాడు. చికిత్స కోసం అచ్చంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం అక్కడి నుంచి హైదరాబాద్‌లోని గాంధీ ఆసుపత్రికి తీసుకెళ్లారు. చికిత్స పొందుతూ శుక్రవారం తెల్లవారుజామున మృతి చెందాడు. మృతుడి అన్న కేతావత్ శంకర్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకొని దార్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పవన్ కుమార్ తెలిపారు. మృతునికి భార్య చిట్టి, ఇద్దరు పిల్లలున్నారు.

దెబ్బతిన్న మద్యం సీసాలు ధ్వంసం

జడ్చర్ల, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): జడ్చర్ల కొత్త బస్టాండు సమీపంలో బుధవారం రాత్రి కంటైనర్ బోల్తాపడి దెబ్బతిన్న మద్యం సీసాలను శుక్రవారం ఎక్సైజ్ అధికారులు ధ్వంసం చేయించారు. మునిసిపాలిటీలోని బురెడ్డిపల్లి నుంచి జాతీయ రహదారికి వెళ్లే మార్గంలోని ప్రధాన రహదారిపై లారీతో సీసాలను బ్రేకేజ్ చేశారు. పెబ్బేరు నుంచి శంషాబాద్‌కు 1,450 కేసుల మద్యం కంటైనర్‌లో తీసుకెళ్తుండగా, వాహనం బోల్తాపడి 536 కేసులు విక్రయానికి వీలులేకుండా దెబ్బతిన్నాయని ఎక్సైజ్ సీఐ విప్లవ్‌రెడ్డి తెలిపారు. ఉన్నతాధికారుల సూచన మేరకు ఆ సీసాలను ధ్వంసం చేయించినట్లు చెప్పారు. మద్యం సీసాలు ధ్వంసం చేసిన సందర్భంగా అరగంట పాటు రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడ్డాయి. రోడ్డుపై పడిన మద్యానికి పొరపాటున నిప్పు అంటుకుని ఉంటే పెద్ద ప్రమాదం జరిగి ఉండేదని స్థానికులు భయాందోళనలు వ్యక్తం చేశారు. సీసాలను ధ్వంసం చేసిన అనంతరం రోడ్డంతా ఎక్సైజ్ అధికారులు శుభ్రం చేయించారు.



బురెడ్డిపల్లి వద్ద డ్యామేజీ అయిన మద్యం సీసాలను ధ్వంసం చేయిస్తున్న ఎక్సైజ్ అధికారులు

న్యూస్ బాక్స్

లక్ష్యం మేరకు కొనుగోలు చేయాలి : కలెక్టర్

నారాయణపేట టౌన్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): లక్ష్యం మేరకు వరి కొనుగోలు చేయాలని కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో ఆమె అధికారులతో సమీక్ష నిర్వహించి, మాట్లాడారు. ఇప్పటివరకు ఎన్ని కేంద్రాలు ప్రారంభించారు?, ఇంకా ఎన్ని ప్రారంభించాల్సి ఉందని అడిగి తెలుసుకున్నారు. నిబంధనల మేరకు కొనుగోలు చేయాలని ఆదేశించారు. ప్రస్తుతం 1120 టార్పాలిన్లు అందుబాటులో ఉన్నాయని అదనంగా 2620 జిల్లాకు రానున్నాయని కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు కలెక్టర్‌కు తెలిపారు. ఎలక్ట్రానిక్ తూకాలకు స్టాంపింగ్ వేయించాలని సూచించారు. రెవెన్యూ అదనపు కలెక్టర్ అశోక్‌కుమార్, సివిల్ సప్లై డీఎం దేవదా స్, వ్యవసాయ శాఖ అధికారి జాన్ సుధాకర్, అదనపు డీఆర్‌డీవో అంజయ్య తదితరులున్నారు.

లాంచి షికారు

హాయిగా.. ఆనందంగా.. నల్లమల కొండల అందాల నడుమ కృష్ణానదిలో విహరించే అవకాశం ఈనెల 26 నుంచి అందుబాటులోకి రానున్నది. రాష్ట్రంలోని ప్రముఖ పర్యాటక ప్రాంతాల్లో ఒకటైన నాగర్‌కర్నూల్ జిల్లాలోని సోమశిల నుంచి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం శ్రీశైలం క్షేత్రంలోని పాతాళగంగ వరకు ఏసీ లాంచీలో ప్రయాణించవచ్చు. అందుకు టికెట్లు ఎక్కడ లభిస్తాయి.. ప్రయాణం ఎలా సాగుతుంది. ఏఏ ప్రాంతాలను సందర్శించొచ్చు.. తదితర సమగ్ర వివరాలతో 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం..

- కొల్లాపూర్, ఆంధ్రజ్యోతి

- నేటి నుంచి కృష్ణానదిలో విహరించే అవకాశం
- సోమశిల నుంచి శ్రీశైల క్షేత్రం వరకు లాంచి
- నల్లమల అందాల నడుమ 70 కిలోమీటర్ల ప్రయాణం
- ఏర్పాట్లు పూర్తి చేసిన తెలంగాణ టూరిజం శాఖ



లాంచీ ప్రయాణం సాగే కృష్ణానది

సోమశిల నుంచి శ్రీశైల క్షేత్రంలోని పాతాళ గంగ వరకు కృష్ణానదిలో విహారానికి తెలంగాణ టూరిజం శాఖ ఏర్పాట్లు పూర్తి చేసింది. శనివారం నుంచి ఈ సౌకర్యం ప్రజలకు అందుబాటులోకి రానున్నది. స్వదేశీ దర్శన్ పథకంలో భాగంగా, తెలంగాణ టూరిజం శాఖ ఆధ్వర్యంలో 2019లో రూ.2.50 కోట్లతో ఒకేసారి 120 మంది ప్రయాణించే ఏసీ లాంచీని గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో మంత్రిగా ఉన్న జూపల్లి కృష్ణారావు ఏర్పాటు చేయించారు. ఈ ఏసీ లాంచిలో ప్రయాణం కొల్లాపూర్ మండలంలోని సోమశిల వద్ద ప్రారంభం కానున్నది. కృష్ణానది నదిలో 70 కిలోమీటర్ల మేర, ఆరు గంటల పాటు ప్రయాణించి శ్రీశైలంలోని పాతాళ గంగకు చేరుకుంటుంది. ప్రస్తుతం కృష్ణానది వరద నీటితో నిండుగా ప్రవహిస్తుండటంతో రాష్ట్రం నలుమూలల నుంచి అధిక సంఖ్యలో పర్యాటకులు సోమశిల గ్రామాన్ని సందర్శించేందుకు వస్తున్నారు. అలాగే వారు నదిలో విహరించేందుకు టూరిజం శాఖ ఏసీ లాంచీని సిద్ధం చేసింది. శనివారం నుంచి సౌకర్యం ప్రారంభం కానున్నది.



సోమశిల కృష్ణానది తీరాన పర్యాటకుల కోసం ఏర్పాటు చేసిన కాటేజీలు

ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో టికెట్ల విక్రయాలు

కృష్ణానదిలో లాంచీ ప్రయాణం చేసేందుకు టూరిజం వారు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో టికెట్లు విక్రయిస్తుంది. 120 మంది ప్రయాణించే సామర్థ్యం ఉన్న ఏసీ లాంచిలో కనీసం 60 మంది ప్రయాణికులు ఉంటేనే లాంచీని ముందుకు కదపరు. 2020 వరకు సాఫీగా సాగిన లాంచీ ప్రయాణం కరోనా కారణంగా తరువాత వరుసగా రెండేళ్లు కొనసాగలేదు. గత ఏడాది కృష్ణానదిలో ఆశించిన మేర వరద జలాలు లేక పోవడంతో లాంచీని నడిపించలేదు. ఈ ఏడాది కృష్ణానదికి వరద భారీగా రావడంతో ఈ సౌకర్యాన్ని ప్రారంభించేందుకు సిద్ధమయ్యారు. లాంచీ టికెట్ ధర పెద్దలకు మూడు వేల రూపాయలు, పిల్లలకు రెండు వేల నాలుగు వందల రూపాయలుగా నిర్ణయించారు. సింగిల్ ట్రిప్ అయితే పెద్దలకు రెండు వేలు, పిల్లలకు 16 వందలు అవుతుంది. దీనికి సంబంధించిన టికెట్లు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లోనూ అందుబాటులో ఉన్నాయి. తెలంగాణ టూరిజం శాఖ వెబ్‌సైట్‌కు లాగిన్ అయి టికెట్ బుక్ చేసుకోవచ్చు. లేదా సోమశిల వద్ద టూరిజం శాఖకు చెందిన ఉద్యోగి చిన్నకు చెందిన నెంబర్ 773185499కు ఫోన్ చేసి ఆఫ్‌లైన్‌లో టికెట్ బుక్ చేసుకునే అవకాశం కూడా ఉంది.

లాంచీ ప్రయాణం ఇలా ..

సోమశిల వద్ద ఈ నెల 26న ఉదయం తొమ్మిది గంటలకు లాంచీ ప్రారంభం అయి ఆరు గంటల తరువాత శ్రీశైలానికి చేరుకుంటుంది. దారిలో పర్యాటకులకు భోజనంతో పాటు టీ, స్నాక్స్ కూడా టూరిజం శాఖ వారే ఇస్తారు. డబుల్ ట్రిప్ బుక్ చేసుకున్న వారు మరుసటి రోజున అంటే 27వ తేదీ ఉదయం తొమ్మిది గంటలకు పాతాళ గంగ వద్ద ఉండే లాంచీ వద్దకు చేరుకోవాల్సి ఉంటుంది. వారిని తిరిగి సోమశిలకు చేర్చుతారు. సింగిల్ ట్రిప్ బుక్ చేసుకున్న వారు పాతాళగంగ వద్ద దిగి వెళ్లిపోవచ్చు. లాంచీలో సౌండ్ సిస్టం కూడా అందుబాటులో ఉంటుంది. హాయిగా, ఆనందంగా ఆట పాటల మధ్య ప్రయాణం కొనసాగించవచ్చు.



లాంచీ వెళ్లే కృష్ణానది మార్గం

దారి పొడవునా అందాల విందు

సోమశిల నుంచి ప్రారంభమై శ్రీశైలం వరకు కృష్ణానదిలో సాగే లాంచీ ప్రయాణంలో దారి పొడవునా నల్లమల అడవి, కొండల అందాలు కనుల విందు చేయనున్నాయి. ప్రయాణికులు ముందుగా సోమశిల క్షేత్రంలోని లలితాంబికా సోమేశ్వరాలయాన్ని దర్శించుకుంటారు. ఆ తర్వాత నదిలో ప్రయాణం ప్రారంభం అవుతుంది. సప్తనదుల సంగమ క్షేత్రాన్ని అనుసరిస్తూ, అమరగిరి గ్రామ అందాలను తిలకిస్తూ దట్టమైన నల్లమల అడవి, ఎత్తయిన కొండల నడుమ ఒడ్డును ఒరుసుకొని పారే కృష్ణమ్మ ఒడిలో విహారం కొనసాగుతుంది. దారిలో వైజాగ్ జాలరులు నివసించే చీమలతిప్పదీవితో పాటు అంకాలమ్మ కోటను దర్శించుకోవచ్చు. అలాగే ముందుకెళ్తుండగా గుండ్లపెంట వద్ద అక్కమహాదేవి గుహలు కనిపిస్తాయి. ఇలా ఆరుగంటల పాటు నదిలో సాగనున్న ప్రయాణం శ్రీశైలం సమీపంలోని పాతాళ గంగ వద్ద ముగుస్తుంది.



బోటు నడుపుతున్న పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు

బోటు నడిపిన మంత్రి జూపల్లి

కొల్లాపూర్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): నిండుగా ఏరులై ప్రవహిస్తున్న సోమశిల కృష్ణానదిలో హుషారుగా బోటు ప్రయాణం సాగింది. రాష్ట్ర పర్యాటక, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు తానే స్వయంగా టూరిజం బోటును నడిపారు. శుక్రవారం కొల్లాపూర్ మండల పరిధిలోని సోమశిల కృష్ణానది పరివాహక ప్రాంతాన్ని మంత్రి రాష్ట్రంలో ఉన్న ప్రముఖ ఆర్కిటెక్చర్ రామ్‌దేవ్‌రావుతో కలిసి సోమశిల గ్రామాన్ని పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు ప్రణాళిక రూపొందించారు. సోమశిల, కొల్లాపూర్ పట్టణంతో పాటు అమరగిరి కృష్ణానది పరివాహక ప్రాంతాలతో పాటు పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టులో భాగమైన అంజనగిరి రిజర్వాయర్‌ను కూడా పర్యాటకులు తిలకించేలా దానిని కూడా సుందరంగా ఆర్కిటెక్చర్‌కు ఆదేశాలిచ్చారు. నేటి నుంచి సోమశిల కృష్ణానది మీదుగా శ్రీశైలం వరకు వెళ్లే లాంచి ప్రయాణాన్ని పర్యాటకులు సద్వినియోగం చేసుకోవాలని మంత్రి కోరారు. అదేవిధంగా సోమశిల కృష్ణానది తీరాన ఉన్న కాటేజీలను సందర్శించి వచ్చే పర్యాటకులను ఆకట్టుకునేలా మరింతగా ఈ ప్రదేశాన్ని తీర్చిదిద్దాలని ప్రణాళిక రూపొందించాలని ఆర్కిటెక్చర్‌కు ఆదేశాలిచ్చారు. సోమశిల పుష్కర ఘాట్ల వద్ద ఏర్పాటు చేసిన మరుగుదొడ్లకు నీటి వసతి ఏర్పాటు చేయకపోవడంతో రాష్ట్ర టూరిజం శాఖ అధికారులతో మంత్రి ఫోన్‌లో మాట్లాడి ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే నీటి వసతి కల్పించి వాటిని వినియోగంలోకి తేవాలని కలెక్టర్ బదావత్ సంతోష్ ఆదేశించారు. ఆయన వెంట కొల్లాపూర్ మునిసిపల్ చైర్‌పర్సన్ మేకల రమ్య, కమిషనర్ శ్రీనివాసన్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

పేట డంపింగ్ యార్డును పరిశీలించిన మునిసిపల్ బృందం



పేట డంపింగ్ యార్డును సందర్శించిన మునిసిపల్ బృందం

నారాయణపేట, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): నారాయణపేట డంపింగ్ యార్డును శుక్రవారం మహబూబ్‌నగర్, జడ్చర్ల, భూత్పూర్, గద్వాల, అలంపూర్, మక్తల్, కోస్గి మునిసిపల్ కమిషనర్లు, ఇంజనీర్లు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్ల బృందం పరిశీలించింది. స్థానిక మునిసిపాలిటీలోని నివాసాల నుంచి సేకరించిన తడిపొడి చెత్తలను వేరు చేసి డంపింగ్ యార్డుకు తరలించి వాటి ద్వారా పునర్వినియోగ వస్తువులను సేకరించి మండే బాస్వరం గల బ్రికెట్స్ తయారీ విధానం పరిశీలించారు. డీజిల్‌కు ప్రత్యామ్నాయంగా ఆయిల్ తయారీ విధానం, మానవ వ్యర్థాల శుద్ధీకరణ ద్వారా వచ్చిన నీటి పునర్వినియోగం, బయోమినింగ్ ప్రక్రియ ద్వారా ఎరువుల తయారీ, తడి చెత్త నుంచి కంపోస్ట్ ఎరువు తయారీ తదితర అంశాలను పరిశీలించారు. పలు అంశాలను పేట మునిసిపల్ కమిషనర్ సునీత మునిసిపల్ సిబ్బందికి వివరించారు.

నీటి సంరక్షణలో భాగస్వాములు కావాలి

- జలశక్తి అభియాన్ కేంద్ర బృందం శాస్త్రవేత్త మధుసూదన్



యల్లందొడ్డి గ్రామంలో మహిళలతో మాట్లాడుతున్న శాస్త్రవేత్త మధుసూదన్, అదనపు కలెక్టర్ నర్సింగరావు

గట్టు/ధరూరు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : నారీ శక్తి సే జనశక్తి అనే నినాదంతో నీటి సంరక్షణలో మహిళలు భాగస్వాములు కావాలని జలశక్తి అభియాన్ కేంద్ర బృందంలోని శాస్త్రవేత్త మధుసూదన్ అన్నారు. ఆయన శుక్రవారం గట్టు మండలంలోని యల్లందొడ్డి గ్రామాన్ని అదనపు కలెక్టర్ నర్సింగరావుతో కలిసి సందర్శించారు. వర్షపు నీటిని ఒడిసిపట్టేందుకు గ్రామ పంచాయతీ పక్కన నిర్మించిన రూఫ్ గార్డెన్ విధానాన్ని పరిశీలించారు. అనంతరం యల్లందొడ్డి గ్రామ సమీపంలో ఉన్న బాలకుంటను పరిశీలించారు. మునలంపల్లి ఫారెస్ట్‌ను సందర్శించి చెక్‌డ్యాంలను ఆయన పరిశీలించారు. అదే విధంగా గట్టు ఎత్తిపోతలను సందర్శించి అక్కడి పనులను పరిశీలించారు. మండల అభివృద్ధి అధికారి చెన్నయ్య, ఇరిగేషన్ ఈఈ రైముద్దీన్, ఏపీడీ శ్రీనివాస్, ఏపీవో స్వామి, ఐకేపీ ఏపీఎం సాంబశివుడు, సీసీలు జ్యోతి, టెక్నికల్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు. అలాగే జిల్లా అదనపు కలెక్టర్ నర్సింగరావు , జలశక్తి అభియాన్ కేంద్ర బృందం సైంటిస్ట్ మధుసూదన్, ఇరిగేషన్ అధికారులు శుక్రవారం ధరూరు మండల కేంద్రంలో పర్యటించారు. అనంతరం పంచాయతీ కార్యాలయంలో సిబ్బందితో సమావేశమయ్యారు. పర్యటనలో భాగంగా జలశక్తి అభియాన్ కింద గ్రామాల్లో తీసిన ఇంకుడు గుంతలను పరిశీలించారు. గ్రామస్థులతో నేటి పొదుపు, నేటి అవసరాలపై ప్రతిజ్ఞ చేయించారు. ఇరిగేషన్ ఈఈ రహీముద్దీన్, శ్రీనివాస్, ఎంపీడీవో, ఏపీవోలు, టెక్నికల్ అసిస్టెంట్లు ఉన్నారు.

అభయారణ్యం నుంచి.. జనంలోకి

(మొదటి పేజీ తరువాయి)

తరలిస్తారు. ఇందులో చెంచులు 107 మంది ఉండగా, చెంచేతరులు 310 మంది ఉన్నట్లు గుర్తించారు. ఎన్‌టీసీఏ పునరావాస పథకం కింద 160 మంది రూ. 15 లక్షలు టోకెన్ అమౌంట్‌గా తీసుకుంటామని చెప్పగా, 257 మంది మాత్రం రెండో ఆప్షన్‌ను ఎంచుకున్నారు. త్వరలోనే ఈ గ్రామాలు ఖాళీ చేయడం ప్రారంభమయ్యే అవకాశాలు ఉండగా అంతకుముందే నాగర్‌కర్నూలు జిల్లా పెద్దకొత్తపల్లి మండలంలోని బాచారంలో ఉన్న అటవీశాఖకు చెందిన 4500 ఎకరాల సోషల్ ఫారెస్టులో స్థలాలు కేటాయించి కాలనీలను అభివృద్ధి చేయనున్నారు. దసరా తర్వాత బాచారంలో కాలనీ ఏర్పాటు పనులు మొదలు పెట్టనున్నారు. మొదట అటవీ భూమిని రెవెన్యూ భూమిగా మారుస్తారు. ఆ తర్వాత రెండు సంవత్సరాలు హోల్డ్‌లో పెట్టి ఆ తర్వాత క్రయవిక్రయాలకు అవకాశం ఇచ్చే అంశాన్ని పరిశీలిస్తున్నారు. రెండో దశలో వటువర్లపల్లి, కొమ్మెనపెంట వంటి మిగతా గ్రామాలను కూడా తరలించనున్నారు. అయితే సార్లపల్లి గ్రామంలోని 40 మంది చెంచులు ఈ పునరావాసానికి ఒప్పుకోవడం లేదని తెలుస్తోంది.

అటవీ, జంతుసంరక్షణ కోసమే..

నల్లమల రాష్ట్రంలోనే అతిపెద్ద అటవీ ప్రాంతం.. ఇది అరుదైన మొక్కలు, అనేక జంతువులకు ఆలవాలం.. కానీ, అభయారణ్యంలో పెరుగుతున్న జనాభా, అందుకు అనుగుణంగా అటవీ ధ్వంసం.. సాగు భూములు పెరుగుతుండటంతో అటవీ సంప

అడవికి దూరమైతే కాటికి వెళ్లినట్లే



అడవుల్లో ఉన్న గిరిజనులు, గిరిజనేతరులను అధికారులు మైదాన ప్రాంతాలకు తరలించబోతున్నారు. స్వచ్ఛందంగా వెళ్లేవారికి మేము వ్యతిరేకం కాదు. మా గిరిజన కుటుంబాలను ఏ శాఖ అధికారులైనా బలవంతంగా తరలించేందుకు ప్రయత్నిస్తే.. అందరిపైనా న్యాయపోరాటం చేస్తాం. ప్యాకేజీ విషయాలు చెబుతున్నారు. వాటిపై నాకు నమ్మకం లేదు. అడవిని వదిలితే కాటికి వెళ్లినట్లే అని భావిస్తాను.

- చిగుళ్ల మల్లికార్జున్, ఆదివాసీ ఐక్యవేదిక రాష్ట్ర కన్వీనర్

దకు తీవ్ర వైన నష్టం వాటిల్లుతోంది. సాగు కోసం ఏర్పాటు చేసిన కంచెల వల్ల మూగజీవాలు ప్రాణాలను కోల్పోతుండటం.. అటవీ ఉత్పత్తుల సేకరణ కోసమో, లేక పశువుల మేతకో వెళ్లినప్పుడు నిప్పు పెట్టడంతో ప్రతీఏట వేల హెక్టార్లలో అటవీ దహనం అవుతోంది. మానవ తప్పిదాలతో జరుగుతున్న ఈ ప్రమాదాలతో కొన్ని కోట్ల మొక్కలు కాలి బూడిదవుతున్నాయి. దాంతోపాటు వేగంగా పరిగెత్తలేని జంతువులు మంటల్లో మసి అయిపోతున్నాయి. అభయారణ్యంలో ఉన్న గిరిజనులు కూడా పంటల సాగు, వాటిని కాపాడుకోవడంలో చాలా ఇబ్బందులు పడుతున్నారు. ఉరులు పెట్టడం, కంచె వేయడం, కరెంటు షాక్ పెట్టడం, విష ప్రయోగం చేయడం వంటివి గతంలో చేసినా ఇప్పుడు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటుండటంతో అడవి పందులు, దుప్పులు, కోతులతో నిత్యం కాపలా ఉన్నా, నష్టం జరుగుతూనే ఉన్నది. విద్యా, వైద్యం వంటి వసతులకు కూడా వీరు దూరమవుతున్నారు. ఎన్నాళ్లు సాగుచేసినా అడవీ భూములపై హక్కులు వచ్చే అవకాశం లేదు. అటు అడవీ సంపదను రక్షించడం, ఇటు చెంచులకు మంచి జీవనం అందించడం కోసం ఈ పునరావాస ఏర్పాట్లు జరుగుతున్నాయని అధికారులు చెబుతున్నారు.

ఎలివేటెడ్ హైవేకు మార్గం సుగమం..

నల్లమల అటవీ ప్రాంతం గుండా జనసంచారం పెరిగిపోతోంది. శ్రీశైలం వెళ్లే వారంతా అటవీ గుండా వెళుతుండటం, మధ్యలో ఆగి మంటలు పెట్టడం, శబ్దాలు చేయడం వంటివి చేస్తున్నారు. అలాగే రాకపోకలు పెరగడం వల్ల జంతువులు రోడ్డు దాటుతూ మరణిస్తున్నాయి. ఈ నేపథ్యంలో సీఎం రేవంత్‌రెడ్డి ఎలివేటెడ్ హైవే నిర్మాణానికి ప్రతిపాదనలు పంపించారు. గత ప్రభుత్వ హయాంలో కూడా ప్రతిపాదించారు. గతంలో సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తిగా పనిచేసిన ఎన్వీ రమణ కూడా ఇక్కడ ఎలివేటెడ్ కారిడార్ ఏర్పాటు అవసరమని కేంద్రానికి సూచించారు . ఈ ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణం వల్ల కింద జంతు సంచారం సులభంగా జరగడంతో పాటు రాకపోకల వల్ల ఎలాంటి ఇబ్బందులు ఉండవు. అచ్చంపేట మండలం బ్రాహ్మణపల్లి నుంచి పాతాలగంగ వరకు ఈ ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణం దాదాపు 57 కిలోమీటర్ల మేర చేయనున్నారు. మొత్తం రూ. 7500 కోట్ల అంచనా వ్యయం అవుతుందని భావిస్తుండగా అనుమతులు వచ్చిన తర్వాత నుంచి ఐదేళ్లలోపు పూర్తి చేయాలి. ఆ సమయంలో కొంత అడవి ధ్వంసం జరిగినా వంద ఏళ్ల వరకు ఇబ్బందులు ఉండవని అటవీ అధికారులు అంచనా వేస్తున్నారు.

కేంద్రం కూడా అనుకూలంగా ఉండటంతో త్వరలోనే ఈ ప్రాజెక్టు పట్టాలెక్కే అవకాశం కచ్చితంగా ఉంది. గ్రామాల తరలింపు వల్ల ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణం కూడా సులభంగా పూర్తిచేయవచ్చని అధికారులు భావిస్తున్నారు.

విద్య, వైద్యంపై ప్రత్యేక దృష్టి

(మొదటి పేజీ తరువాయి)

అన్ని విధాల అభివృద్ధి చేయాలన్న లక్ష్యంతో ముందుకు సాగుతున్నామని చెప్పారు. అనంతరం ఎమ్మెల్యేలు శ్రీహరి, మధుసుదన్‌రెడ్డి, శంకరయ్య, కలెక్టర్ విజయేందిర బోయి మాట్లాడారు.

స్థల పరిశీలన

జిల్లా కేంద్రంలోని డైట్ కళాశాల ఆవరణ టాస్క్ సెంటర్ కోసం స్థలాన్ని మంత్రి శ్రీధర్‌బాబు, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి పరిశీలించారు. ఇక్కడ టాస్క్ సెంటర్ ఏర్పాటు అందరికీ అందుబాటులో ఉంటుందని తెలిపారు.

మహబూబ్‌నగర్ ఫస్ట్ ప్రారంభించిన మంత్రి

జిల్లా కేంద్రంలోని భగీరథ కాలనీలో ఏర్పాటు చేసిన మహబూబ్‌నగర్ ఫస్ట్ నవరత్నాల కార్యక్రమాన్ని మంత్రి శ్రీధర్‌బాబు, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, మునిసిపల్ చైర్మన్ ఆనంద్‌గౌడ్, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ బెక్కరి అనిత తదితరులు పాల్గొన్నారు.



మహబూబ్‌నగర్ ఫస్ట్ భవనాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్, చిత్రంలో మంత్రి శ్రీధర్‌బాబు, ఎమ్మెల్యేలు యెన్నం, శంకర్

రుణమాఫీ పూర్తి చేయాలి

- గద్వాల కలెక్టరేట్ ముందు ధర్నా, రాస్తారోకో
- రుణమాఫీని పూర్తి చేయకపోతే త్వరలో అసెంబ్లీ ముట్టడి
- నడిగడ్డ హక్కుల పోరాట సమితి జిల్లా చైర్మన్ రంజిత్‌కుమార్

గద్వాల క్రైం, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): రైతులకు రూ. రెండు లక్షల రుణమాఫీని పూర్తిచేయకపోతే త్వరలోనే అసెంబ్లీని ముట్టడిస్తామని నడిగడ్డ హక్కుల పోరాట సమితి జిల్లా చైర్మన్ గొంగళ్ల రంజిత్‌కుమార్ డిమాండ్ చేశారు. శుక్రవారం రైతులకు రెండు లక్షల రుణమాఫీని వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేస్తూ కలెక్టరేట్ ముందు ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా రంజిత్‌కుమార్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత రైతులకు రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చి 10 నెలలు అయినా రూ. 2 లక్షల రుణమాఫీ కాలేదన్నారు. అలాగే పెట్టుబడి సాయంగా రైతుకు ఇస్తామన్న రైతు భరోసాకు దిక్కులేదని విమర్శించారు. ఆధార్‌కార్డు, బ్యాంకు పాస్ పుస్తకం, భూమి పాస్ పుస్తకంలో పేర్లలో చిన్న చిన్న తప్పులు ఉన్నాయన్న సాకుతో కూడా రుణమాఫీ చేయడం లేదన్నారు. వెంటనే ఈ సమస్యపై కలెక్టర్ బ్యాంకర్లతో సమావేశం ఏర్పాటు చేసి రుణమాఫీ పూర్తి అయ్యేలా చూడాలన్నారు. ఒక వైపు ప్రభుత్వం రైతులకు రుణమాఫీ చేశామని గొప్పగా చెబుతున్నప్పటికీ క్షేత్రస్థాయిలో రైతులకు రుణమాఫీ కానివారు ఎందరో ఉన్నారనే విషయం కలెక్టర్ దగ్గరకు వచ్చిన రైతులను చూస్తే ఇట్టే అర్థం అవుతుందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి రైతులకు రుణమాఫీతో పాటు రైతు భరోసా వెంటనే అమలు చేయాలని కలెక్టర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. కన్వీనర్ బుచ్చిబాబు, నాయకులు లవన్న, వెంకట్రాములు, బలరాంనాయుడు, గోవిందు, విష్ణు, తిమ్మప్ప, ప్రేమ్‌రాజు, శ్రీనివాస్‌యాదవ్ తదితరులు ఉన్నారు.

హజరత్ యూసుఫొద్దీన్ ఉర్సులో అన్నదానం

ఊర్కొండ, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా ఊర్కొండలోని కల్వకుర్తి -జడ్చర్ల ప్రధాన రహదారి సమీపంలో ఉన్న గుట్టపై వెలిసిన హజరత్ యూసుఫొద్దీన్ దర్గాలో ఉర్సు ఉత్సవాలు భక్తి శ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా పరిసర ప్రాంతాలతో పాటు సుదూర ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి ప్రత్యేక ప్రార్థనలు చేసి, మొక్కులు చెల్లించుకున్నారు. దర్గా నిర్వాహకులు అన్నదానం నిర్వహించారు. కాంగ్రెస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ ద్యాప నిఖిల్ రెడ్డి పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కాంగ్రెస్ మైనార్టీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి అబ్దుల్ సమీ, నాయకులు ఆరీఫ్, నర్సిరెడ్డి, మనోహర్ రెడ్డి, భాస్కర్ దయాకర్, రఫీ, శ్రీశైలం, చంద్రకాంత్ ఉన్నారు.

చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి

- కల్వకుర్తి ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి
- ముగిసిన ఉమ్మడి జిల్లా స్పోర్ట్స్ మీట్



ప్రథమ స్థానంలో నిలిచిన కల్వకుర్తి జట్టుకు షీల్డ్ బహూకరిస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

కల్వకుర్తి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని కల్వకుర్తి ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి కోరారు. క్రీడల్లో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభ చాటితే రిజర్వేషన్ సౌకర్యం పొందవచ్చని అన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి పట్టణంలోని మహాత్మజ్యోతిబాపూలే బాలిక గురుకులంలో ఉమ్మడి జిల్లా స్థాయి స్పోర్ట్స్‌మీట్ శుక్రవారం ముగిసింది. హోరాహోరీగా సాగిన క్రీడల్లో 16 గురుకులాల నుంచి 520 మంది విద్యార్థినులు పాల్గొన్నారు. వాలీబాల్ పోటీల్లో కల్వకుర్తి ప్రథమ స్థానంలో నిలువగా నర్వ ద్వితీయ స్థానంలో నిలిచింది. కబడ్డీలో కల్వకుర్తి ప్రథమ స్థానం, తాడూరు ద్వితీయ స్థానం, ఖోఖోలో కల్వకుర్తి ప్రథమస్థానం, ఉయ్యాలవాడ ద్వితీయ స్థానంలో నిలిచాయి. ఓవరాల్ చాంపియన్ షిప్‌ను కల్వకుర్తి దక్కించుకుంది. గురుకుల ఆవరణంలో జరిగిన క్రీడల ముగింపు కార్యక్రమానికి ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు సభ్యుడు ఠాగూర్ బాలాజీసింగ్, అడిషనల్ కలెక్టర్ దేవసహాయం హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గురుకులాల ఏర్పాటుతో ఎంతో మంది పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందని పేర్కొన్నారు. కల్వకుర్తి సీఐ డి.నాగార్జున, ఆర్‌సీవో వెంకట్‌రెడ్డి, ప్రిన్సిపాల్ నాగమణి, కౌన్సిలర్లు బాలునాయక్, రవీందర్, నాయకులు సురేందర్‌రెడ్డి, జిల్లెల్ల రాములు, పలువురు నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

పనులను నాణ్యతగా చేపట్టాలి

- నాగర్‌కర్నూల్ కలెక్టర్ బదావత్ సంతోష్



పాలశీతలీకరణ కేంద్రం పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ సంతోష్

వంగూరు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): కొండారెడ్డిపల్లిలో నిర్మాణం జరుగుతున్న అభివృద్ధి పనులు నాణ్యతగా, త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ సంతోష్ సంబంధిత అధికారులను ఆదేశించారు. వంగూరు మండలంలోని కొండారెడ్డిపల్లి గ్రామంలో ఇటీవలే రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గ్రామంలో వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన నిర్మాణ పనుల పురోగతిని శుక్రవారం సంబంధిత శాఖల అధికారులతో కలిసి కలెక్టర్ సంతోష్ పరిశీలించారు. గ్రామంలో రూ.2.50 కోట్లతో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో నిర్మాణంజరుగుతున్న పాల శీతలీకరణ కేంద్రాన్ని, కొండారెడ్డిపల్లి గేటు నుంచి శివారు వరకు రూ, 20 కోట్లతో జరుగుతన్న నాలుగు లైన్ల రహదారి పనులను కలెక్టర్ పరిశీలించి పురోగతి పనుల వివరాలను అధికారులతో అడిగి తెలుసుకున్నారు. గ్రామ శివారులో ప్రతిపాదించిన సోలార్ విద్యుత్ ప్లాంట్‌కు కేటాయించిన స్థలాన్ని రెవెన్యూ అధికారులతో కలిసి పరిశీలించారు. నాలుగు లైన్ల రహదారి బీటీ రోడ్డు పనులతో పాటు అండర్ డ్రైనేజి సీసీ రోడ్డు, గ్రామంలో సెంట్రల్ లైటింగ్ పనుల వారీగా ఎప్పటిలోగా పూర్తి అవుతాయో వివరాలను కలెక్టర్ శాఖల వారిగా అధికారులలో అడిగి తెలుసుకున్నారు. మెయిన్ రోడ్డు నుంచి మిషన్ భగీరథ మెయిన్ పైపులైన్ కోసం విడుదలైన రూ.2 కోట్లతో పనులు ప్రారంభించి పూర్తి చేయాలని కలెక్టర్ సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు. ఆర్డీవో శ్రీను, గ్రామ అభివృద్ధి పనుల నోడల్ అధికారి రమేష్, పంచాయతీరాజ్, విద్యుత్, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

గ్రామీణ క్రీడాకారులు వెలుగులోకి రావాలి

» జిల్లా క్రికెట్ సంఘం ప్రధాన కార్యదర్శి రాజశేఖర్



క్రీడాకారులనుద్దేశించి మాట్లాడుతున్న రాజశేఖర్

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, అక్టోబరు 25 : గ్రామీణ క్రీడాకారులు వెలుగులోకి రావాలని క్రికెట్ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రాజశేఖర్ అన్నారు. జిల్లా క్రికెట్ సంఘం ఆధ్వర్యంలో మహబూబ్‌నగర్ పట్టణంలోని ఎండీసీఏ మైదానంలో నిర్వహిస్తున్న ఉమ్మడి జిల్లా అండర్-23 క్రికెట్ టోర్నీ ఉత్సాహంగా కొనసాగుతోంది. శుక్రవారం మూడవ రోజు నాగర్‌కర్నూల్, వనపర్తి జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌కు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైదరాబాద్ క్రికెట్ సంఘం సహకారంతో గత వేసవిలో శిక్షణా శిబిరాలు నిర్వహించినట్లు తెలిపారు. ప్రతిభావంతులైన క్రీడాకారులకు అండగా ఉంటామని తెలిపారు. ఉమ్మడి జిల్లా టోర్నీలో జిల్లా క్రీడాకారులు ప్రతిభ చాటి తుది జట్టుకు ఎంపిక కావాలని ఆకాంక్షించారు. ఉమ్మడి జిల్లా జట్టు హెచ్‌సీఏ టోర్నీలోనూ పాల్గొంటుందని చెప్పారు. కార్యక్రమంలో ఎండీసీఏ ప్రతినిధులు సురేష్ కుమార్, వెంకటరామరావు, కోచ్‌లు గోపాలకృష్ణ, అబ్దుల్లా పాల్గొన్నారు.

16 పరుగులతో నాగర్‌కర్నూల్ జట్టు గెలుపు

ఉమ్మడి జిల్లా అండర్-23 క్రికెట్ టోర్నీలో శుక్రవారం జరిగిన మ్యాచ్‌లో నాగర్‌కర్నూల్ జట్టు 16 పరుగుల తేడాతో వనపర్తిపై గెలిచింది. మొదట బ్యాటింగ్ చేసిన నాగర్‌కర్నూల్ జట్టు 44.2 ఓవర్లలో 169 పరుగులకు ఆలౌట్ అయ్యింది. జట్టులో తరుణ్ 35 పరుగులు చేయగా, వనపర్తి జట్టు బౌలర్లలో చత్రపతి నాలుగు, దానిష్, ప్రణీత్‌రెడ్డి చెరో రెండు వికెట్లు తీశారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన వనపర్తి జట్టు 31 ఓవర్లలో 153 పరుగులకు కుప్పకూలింది. వనపర్తి జట్టులో అభిలాష్ (56) అర్ధ సెంచరీతో రాణించాడు. నాగర్‌కర్నూల్ జట్టు బౌలర్లలో అభినవ్‌తేజ నాలుగు, జయంత్ రెండు వికెట్లు తీసి జట్టు గెలుపునకు కృషి చేశారు.

రేపు ఖోఖో జిల్లా జట్ల ఎంపికలు

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, అక్టోబరు 25 :జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో ఈ నెల 27న అండర్- 14 మహబూబ్‌నగర్ జిల్లా బాల, బాలికల ఖోఖో జట్ల ఎంపికలు నిర్వహిస్తున్నట్లు ఎస్‌జీఎఫ్ సెక్రటరీ శారదాబాయి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్టేడియం మైదానంలో ఉదయం ఎనిమిది గంటలకు ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థులు బోనఫైడ్, ఆధార్ కార్డు జిరాక్స్ పత్రాలతో సకాలంలో హాజరు కావాలని సూచించారు.

రేపు హ్యాండ్‌బాల్ సబ్ జూనియర్ బాలికల జట్టు ఎంపికలు

జడ్చర్ల, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్లలో ఈ నెల 27న హ్యాండ్ బాల్ సబ్ జూనియర్ బాలికల టీం ఎంపిక చేపట్టనున్నట్లు హ్యాండ్‌బాల్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు తఖియొద్దీన్, శంకర్‌నాయక్‌లు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జడ్చర్ల పట్టణంలోని మినీ స్టేడియంలో ఈ పోటీలను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

ఇల్లే నందనవనం

మిద్దెక్కితే పారిజాతం, నందివర్ధనం పూలు పలుకరిస్తాయి. చేమంతి, బంతి, మల్లెలు, గులాబీలు తమనీ చూడమంటాయి. జామ, దానిమ్మ చెట్లు పండ్ల రుచి చూడమంటాయి. బెండ, మిరప, టమాట ఇలా ఎన్నో కూరగాయలు, ఆకుకూరలు కనిపిస్తాయి. నారాయణపేటకు చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు ఎస్.విశ్వనాథ్ తన ఇంటి మిద్దెపై సేంద్రియ పద్ధతిలో పెంచిన తోట అందాలివి..

- నారాయణపేట రూరల్ (ఆంధ్రజ్యోతి)



» మిద్దె తోట ఏర్పాటు చేసిన ఉపాధ్యాయుడు » పూలు, కూరగాయ మొక్కల పెంపకం
» రసాయనిక ఎరువులకు దూరం » ఆర్గానిక్ పద్ధతిలో సాగు

మొక్కల పెంపకంపై ఆసక్తి.. ఆరోగ్య పరిరక్షణపై దృష్టి.. వెరసి రూపుదిద్దుకున్న అందాల మిద్దె తోట ఇది. ఆ ఇంటి యజమాని ఎస్.విశ్వనాథ్. నారాయణపేట జిల్లా కేంద్రానికి చెందిన ఆయన దామరగిద్ద మండలంలోని కాన్‌కుర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గణితం ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నారు. తన అభిరుచికి వేదికగా ఇంటినే ఎంచుకొని, నందనవనంగా మార్చారు. మొక్కల పెంపకానికి రసాయనిక ఎరువులను వినియోగించకుండా, సేంద్రీయ ఎరువులను వాడుతున్నారు. పూలమొక్కలను పెంచడంతో పాటు, పండ్లు, కూరగాయలను పండిస్తున్నారు.

ప్రస్తుతం మిద్దె తోటలో 250కి పైగా మొక్కలున్నాయి. పూల మొక్కలైన పారిజాతం, నందివర్ధనం, గోవర్ధనం, గన్నేరు, దేవ గన్నేరు, చేమంతి, బంతి, జర్మన్ బంతి, నిత్య మల్లెలు, గులాబీలు, హజారీ మొగ్ర, లిల్లీ, సత్యనారాయణ పూలతో పాటు గోరింట చెట్టును కూడా మిద్దెపై పెంచారు. అలాగే దానిమ్మ, జామ, అరటి పళ్ల మొక్కలు, బెండ, వంకాయ, మిరప, టమాట, బూడిద గుమ్మడి తదితర కూరగాయల మొక్కలు కూడా ఉన్నాయి. తులసి, కలబంద, రణపాల, గగ్గర పత్తి వంటి ఔషధ మొక్కలు, బ్రహ్మకమలం వంటి అరుదైన మొక్కలను పెంచారు. అలాగే తమలపాకు, మనీ ప్లాంట్ వంటి తీగ మొక్కలు మిద్దె తోటకు అదనపు ఆకర్షణగా నిలుస్తున్నాయి.

ఆరేళ్లుగా మిద్దెతోట నిర్వహణ

పాఠశాలలో విద్యార్థులకు ఇష్టంగా బోధించే ఆయన, మొక్కలను కూడా అంతే ప్రేమతో పెంచుతున్నారు. దాదాపు ఏడేళ్లుగా మిద్దెపైనే కాకుండా ఇంటి ఆవరణలోనూ పలు మొక్కలను నాటి, శ్రద్ధతో పెంచుతూ ప్రకృతిపై తన ప్రేమను చాటుతున్నాడు. ఉపాధ్యాయ వృత్తికి న్యాయం చేస్తూనే, ఉదయం, సాయంత్రం వేళల్లో తన భార్య శ్రీవిద్య సహకారంతో ప్రతీ రోజు మూడు గంటల సమయాన్ని మొక్కల సంరక్షణకు కేటాయిస్తున్నారు. మొక్కల పెంపకానికి సేంద్రీయ ఎరువులను మాత్రమే వాడుతూ పర్యావరణ పరిరక్షణకు కృషి చేస్తున్నారు. అందుకోసం ఆయన మేకలు, గొర్రెలు, బర్రెలు, ఆవులు, ఎద్దుల పేడతో పాటు వాటి మూత్రాన్ని వాడుతున్నాడు. ఇంట్లో టీ చేసిన తర్వాత మిగిలే పొడిని, కూరగాయాల వ్యర్థాలను ఎరువుగా మార్చి వినియోగిస్తున్నారు. ఇలా పూర్తిగా సేంద్రియ పద్ధతిలో తాను స్వయంగా పండించిన కూరగాయలనే ఇంట్లో వంటకు వినియోగిస్తున్నారు.



మొక్కల పెంపకం నా హాబీ

మా ఇంటి ఆవరణతో పాటు, మిద్దెపై ఆరేళ్ళుగా మొక్కలు పెంచుతున్నాను. మొక్కలంటే నాకు చాలా ఇష్టం. పాఠశాల సమయం తర్వాత మొక్కలకు నీరు పోయడం, వాటిని సంరక్షించడం నాకు సరదా. నా భార్య శ్రీవిద్య అందుకు ఎంతో సహకరిస్తున్నారు.

- సగర్ విశ్వనాథ్



మిద్దెతోటలోని పూలు, కూరగాయల మొక్కలు

నష్టం కలుగకుండా జాగ్రత్తలు

» లైజనింగ్ అధికారి శ్రీనివాసులు



వివరాలు వెల్లడిస్తున్న శ్రీనివాసులు

రాజోలి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : ప్రజలకు, రైతులకు, పంట పొలాలకు ఎలాంటి నష్టమూ కలుగకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటామని ఇథనాల్ పరిశ్రమ లైజెనింగ్ (అనుసంధాన కర్త) అధికారి శ్రీనివాసులు అన్నారు. జోగులాంబ గద్వాల రాజోలి మండలంలోని పెద్ద ధన్వాడ గ్రామంలో గాయత్రి రెన్యువబుల్ ఫ్యూయల్ మరియు అలీవ్ ఇండస్ట్రీస్ ప్రైవేటు లిమిటెడ్ కంపెనీ వారు ఏర్పాటు చేస్తున్న ఇథనాల్ పరిశ్రమ పనులను గ్రామస్థులు గురువారం అడ్డుకొని ధర్నా చేశారు. పోలీసులు, రెవెన్యూ అధికారులు వారితో చర్చించారు. పనులను నిలిపి వేసి, తహసీల్దార్ కార్యాలయానికి వచ్చి గ్రామస్థుల సందేహాలను నివృత్తి చేయాలని కంపెనీ ప్రతినిధులకు చెప్పారు. దీంతో శుక్రవారం లైజనింగ్ అధికారి శ్రీనివాసులు రాజోలిలోని తహసీల్దార్ రామ్మోహన్‌ను, ఎస్‌ఐ జగదీశ్వర్‌ను కలిసి పరిశ్రమ వివరాలను తెలిపారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఫ్యాక్టరీ అధికారులు, ఇంజనీర్లు, సైంటిస్టులు వచ్చి గ్రామస్థులతో సంయుక్త సమావేశం నిర్వహించాలని అధికారులు సూచించినట్లు తెలిపారు. ప్రజల అనుమానాలను నివృత్తి చేసిన తర్వాతే పనులను చేపట్టాలన్నారని చెప్పారు. ఇలాంటి ఫ్యాక్టరీలు ఎక్కడైనా ఉంటే గ్రామస్థులను అక్కడికి తీసుకెళ్లి చూపించాలని సూచించారన్నారు. ప్రజలు ఒప్పుకునేంత వరకు పనులను నిలిపి వేయాలన్నారని తెలిపారు. పరిశ్రమకు అన్ని అనుమతులు ఉన్నాయని చెప్పారు.

నిర్మల్ జిల్లావాసుల అడ్డగింత

» చిత్తనూరుకు వస్తుండగా ఆపిన పోలీసులు » జడ్చర్ల మీదుగా హైదరాబాద్‌కు తరలింపు



గండ్లంపల్లి గ్రామస్థులతో మాట్లాడుతున్న పోలీసులు

మరికల్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : ఇథనాల్ పరిశ్రమను పరిశీలించి, బాధితులతో మాట్లాడి వివరాలు తెలుసుకునేందుకు చిత్తనూర్‌కు వస్తున్న నిర్మల్ జిల్లా వాసులను పోలీసులు అడ్డుకున్నారు. ఆ జిల్లాలోని దిలావర్‌పూర్ మండలం, గుండ్లంపల్లి గ్రామస్థులు వంద మంది రెండు బస్సుల్లో గురువారం రాత్రి అక్కడి నుంచి బయలుదేరారు. ఈ విషయంపై ముందస్తు సమాచారం అందడంతో శుక్రవారం ఉదయం మరికల్ మండల శివారులో పోలీసులు వారిని అడ్డుకున్నారు. చిత్తనూరులోని ఇథనాల్ పరిశ్రమ వద్దకు వెళ్లేందుకు అనుమతి లేదని స్పష్టం చేశారు. పోలీస్ అధికారులు ఎస్కార్ట్ వాహనాలతో వారిని జడ్చర్ల దాటించి హైదరాబాద్ వైపు తరలించారు. ఈ విషయం తెలుసుకున్న చిత్తనూర్ ఇథనాల్ కంపెనీ వ్యతిరేక పోరాట కమిటీ సభ్యులు ఎం.రాఘవాచారి, డి.చంద్రశేఖర్, ఎస్ఎం ఖలీల్, జె.చక్రవర్తి ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. దిలావర్‌పూర్‌లో ఏర్పాటు చేస్తున్న ఇథనాల్ కంపెనీని రద్దు చేయాలని అక్కడి ప్రజలు గత కొంత కాలంగా ఉద్యమిస్తున్నట్లు తెలిపారు. వారు చిత్తనూరు గ్రామస్థులను కలిసి పరిశ్రమ వల్ల కలిగిన కష్ట నష్టాలను తెలుసుకునేందుకు వచ్చినట్లు తెలిపారు. వారిని అడ్డుకోవడం సరికాదని పేర్కొన్నారు.

బాలిక ఆత్మహత్యపై అనుమానాలు

» కొన్నేళ్లుగా సీడ్ ఆర్గనైజర్, ఆయన బంధువు ఇళ్లలో వెట్టి చాకిరీ
» గద్వాలలో చోరీ జరిగితే మల్దకల్ పోలీస్‌స్టేషన్లో విచారణ
» కేసు నుంచి ఆర్గనైజర్‌ను తప్పించేందుకు యత్నాలు

గద్వాల క్రైం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : జోగుళాంబ గద్వాల జిల్లా, మల్దకల్ మండల పరిధిలోని బిజ్వారం గ్రామానికి బాలిక మృతిపై పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. తన ఇంట్లో పని చేస్తున్న బాలికపై సీడ్ ఆర్గనైజర్ బంగారు దొంగతనం నేరాన్ని మోపిన విషయం తెలిసిందే. ఆమెను పోలీసులు పిలిచి విచారించడంతో అవమానంగా భావించి పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసింది. అప్పటి నుంచి కర్నూల్ జిల్లా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందింది. అయితే ఆ బాలిక గతంలో ఐదేళ్ల పాటు హైదరాబాద్‌లోని ఆయన బంధువు ఇంట్లో కూడా పని చేసినట్లు తెలిసింది. అంటే అప్పుడు ఆ బాలిక వయసు 12 సంవత్సరాలే ఉంటుంది. ఇలా మైనర్‌తో ఏళ్ల తరబడి పని చేయిస్తున్నా చైల్డ్ లేబర్ అధికారులు గుర్తించకపోవడంపై విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. అలాగే చోరీ గద్వాలలో జరిగితే, ఆ బాలికను మల్దకల్ పోలీస్ స్టేషన్‌లో విచారించడంపై కూడా సందేహాలు వ్యక్తం అవుతున్నాయి. ఈ కేసు నుంచి సీడ్ ఆర్గనైజర్‌ను తప్పించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నట్లు సమాచారం. ఈ విషయంలో ఓ ప్రజా ప్రతినిధి పోలీసులపై ఒత్తిడి తెస్తున్నట్లు తెలిసింది. అంతేకాకుండా తీవ్ర నిర్బంధం మధ్య బాలిక కుటుంబ సభ్యులపై ఒత్తిడి చేసి అంత్యక్రియలు నిర్వహించడంలో పోలీసుల కీలకపాత్ర పోషించినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా జిల్లా పోలీసు అధికారులు ఘటనపై పూర్తి విచారణ చేపట్టి, బాలిక ఆత్మహత్యకు కారణమైన వారిపై చట్ట రీత్యా చర్యలు తీసుకోవాలని ప్రజలు భావిస్తున్నారు. ఈ విషయంపై డీఎస్పీ సత్యనారాయణను 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా, పూర్తి స్థాయిలో విచారణ చేపట్టి, బాధ్యులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

న్యూస్ బాక్స్

పందెం కోళ్ల వేలం

» రూ.39,650 ఆదాయం



న్యాయాధికారి సమక్షంలో పందెం కోడిని వేలం వేస్తున్న దృశ్యం

కొల్లాపూర్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : దాడుల్లో స్వాధీనం చేసుకున్న పందెం కోళ్లను శుక్రవారం నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ జూనియర్ సివిల్ కోర్టు ప్రాంగణంలో వేలం వేశారు. ఇటీవల కొల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని కోడేరు మండలంలో కోళ్ల పందేల స్థావరాలపై పోలీసులు దాడి చేసి, కేసులు నమోదు చేశారు. ఈ సందర్భంగా స్వాధీనం చేసుకున్న 12 పందెం కోళ్లను శుక్రవారం స్పెషల్ జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ ఆఫ్ సెకండ్ క్లాస్ కోర్టులో ప్రవేశపెట్టారు. న్యాయాధికారి జ్యోత్స్న గుంటి ఆధ్వర్యంలో వాటిని వేలం వేశారు. వేలంలో వచ్చిన రూ. 39,650 ప్రభుత్వ ఖజానాకు జమ చేశారు.

డీసీసీబీ అభివృద్ధే లక్ష్యం

» సమీక్షా సమావేశంలో చైర్మన్ మామిళ్లపల్లి విష్ణువర్ధన్ రెడ్డి



డీసీసీబీ చైర్మన్ మామిళ్లపల్లి విష్ణువర్ధన్ రెడ్డిని సన్మానిస్తున్న ఉద్యోగులు

కొల్లాపూర్ ,అక్టోబరు25 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి జిల్లాలోని సహకార కేంద్ర బ్యాంకులను అభివృద్ధి చేయడమే తమ లక్ష్యమని డీసీసీబీ చైర్మన్ మామిళ్లపల్లి విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ పట్టణంలోని డీసీసీబీ కార్యాలయంలో సింగిల్‌విండో చైర్మన్లు, బ్యాంకు సీఈవో, సిబ్బందితో శుక్రవారం నిర్వహించిన సమీక్ష సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొల్లాపూర్ నియోజకవర్గంలోని కొల్లాపూర్, పాన్‌గల్ సింగిల్‌విండో బ్రాంచ్‌లు రూ. 42 కోట్ల రుణమాఫీ పొంది ఉమ్మడి జిల్లాలోనే మొదటి స్థానంలో నిలవడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. రుణమాఫీ పొందిన రైతులకు వారి భూమిని బట్టి లక్ష అరవై వేల రూపాయల వరకు అధిక రుణాలను అందించినట్లు తెలిపారు. ఇప్పటివరకు 70 శాతం రైతులకు అధిక రుణాలను మంజూరు చేశామన్నారు. రైతులకు దీర్ఘకాలిక రుణాలు కూడా అందించనున్నట్లు తెలిపారు. రాబోయే రోజుల్లో రాష్ట్ర ప్రభుత్వ సహాయం, మంత్రి జూపల్లి కృష్ణారావు సహకారంతో డీసీసీబీని మరింత అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామన్నారు. అంతకుముందు కొల్లాపూర్ నియోజకవర్గ సింగిల్‌విండో చైర్మన్లు, డైరెక్టర్, అధికారులు డీసీసీబీ చైర్మన్ విష్ణువర్ధన్ రెడ్డిని ఘనంగా సన్మానించారు. సమావేశంలో కొల్లా పూర్ సింగిల్‌విండో చైర్మన్ పెబ్బేటి కృష్ణయ్య, డైరెక్టర్లు పాల్గొన్నారు.

స్ఫూర్తినిచ్చిన దార్శనికుడు దాశరథి

» వనపర్తి ఎస్పీ రావుల గిరిధర్



దాశరథి శతజయంతి సభలో మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ రావుల గిరిధర్

వనపర్తి రూరల్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ ప్రాంతంలోని ఎందరో కవులకు స్ఫూర్తినిచ్చిన దార్శనికుడు మహాకవి దాశరథి కృష్ణమాచార్యులు అని వనపర్తి ఎస్పీ రావుల గిరిధర్ అన్నారు. వనపర్తి పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో దాశరథి శత జయంతి వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ ప్రభుత్వ సాహిత్య త్రైమాసిక పత్రిక పునాస సంచికను కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఉమ, కవులతో కలిసి ఆవిష్కరించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ తెలంగాణ కవిత్వాన్ని ప్రపంచానికి చాటిన మహనీయుడు మహాకవి దాశరథి అని జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ అన్నారు. తెలంగాణ జాతిని జాగృతం చేసిన ప్రజాకవి దాశరథి అని, ఆయన జీవితం దేశానికే ఆదర్శ ప్రాయమని కొనియాడారు. ఆయనను కవులు, కళాకారులు, విద్యార్థులు స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. నిజాం నిరంకుశ ప్రభుత్వాన్ని నిరసిస్తూ ప్రజలను తన రచనల ద్వారా చైతన్య పరిచి తెలంగాణ ప్రాంత విముక్తికి ఊపిరి పోసిన మహనీయుడని గుర్తు చేశారు. ఆ సందర్భంలో పలుమార్లు జైలుకు కూడా వెళ్లారని తెలిపారు. అగ్నిధార, రుద్రవీణ, తిమిరంతో సమరం తదితర రచనలు ఆయనను ప్రజాకవిగా నిలబెట్టాయన్నారు. అనంతరం వ్యాసరచన, ఉప న్యాస పోటీల్లో విజేతలైన విద్యార్థులకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో తెలుగు భాషా చైతన్య సమితి అధ్యక్షుడు పి.బడేసాబ్, సాహిత్య వేత్తలు డాక్టర్ నాశేశ్వరం శంకరం, డాక్టర్ పెబ్బేటి మల్లికార్జున్, గంటా మనోహర్ రెడ్డి, అర్ధచంద్రప్రకాష్ రెడ్డి, పాలడుగు సరోజినీదేవి, డాక్టర్ రాధా కుసుమ, తెలుగు అధ్యాపకుడు ఎజ్జు మల్లయ్య, రంజిత్ కుమార్, కళాశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆరు క్వింటాళ్ల నల్లబెల్లం స్వాధీనం

కల్వకుర్తి టౌన్, అక్టోబర్ 25 (ఆంధ్రజ్యోతి) : ఎన్‌ఫోర్స్‌మెంట్, టాస్క్‌ఫోర్స్ స్టేషన్ టీంల ఆధ్వర్యంలో దాడులు నిర్వహించి ఆరు క్వింటాళ్ల నల్లబెల్లాన్ని స్వాధీనం చేసుకున్నట్లు సీఐ వెంకట్ రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మహబూబ్‌నగర్, కల్వకుర్తి స్టేషన్‌టీం ఆధ్వర్యంలో నిర్వహించిన రూట్‌వాచ్ దాడుల్లో ఆరు వందల కిలోల నల్లబెల్లాన్ని స్వాధీనం చేసుకొని, 300 లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేసినట్లు తెలిపారు. 20 లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకొని చేసుకుని 2 కేసులు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. దాడుల్లో కార్యక్రమంలో ఎక్సైజ్ సీఐలు బాలకృష్ణారెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, శారద, ఎస్ఐలు సృజన్, అరుణ, సిబ్బంది పాల్గొన్నారు.

వేలంలో రికార్డు స్థాయి ఆదాయం

» సమకూరిన రూ. 3.23 కోట్లు

అలంపూరు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : జోగుళాంబ గద్వాల జిల్లాలోని అలంపూర్‌లో వివిధ సేవలు, విక్రయాలకు శుక్రవారం నిర్వహించిన వేలంలో రికార్డు స్థాయి ఆదాయం సమకూరింది. దేవాదాయ, ధర్మాదాయ శాఖ మహబూబ్‌నగర్ జిల్లా సహాయ కమిషనర్ మదనేశ్వర్‌రెడ్డి పర్యవేక్షణలో వేలం నిర్వహించారు. వేలంలో రూ. 3,23,82,000 ఆదాయం సమకూరింది. పూజా సామగ్రి విక్రయాలను మహేశ్‌గౌడ్ రూ.1.27 లక్షలు, బుక్‌స్టాల్ నిర్వహణకు వెంకట్రామిరెడ్డి రూ. 22 లక్షలు, వాహనాల రుసుము వసూలుకు పి.సతీశ్‌రెడ్డి రూ.70 లక్షలకు దక్కించుకున్నారు. చీరల విక్రయానికి మహేష్ గౌడ్ రూ. 91 లక్షలు, కొబ్బరి చిప్పలకు టి మోహన్ రూ. 12.30 లక్షలకు వేలం పాడి సొంతం చేసుకున్నారు. వసతి గదులకు బి.రమేశ్ నాయుడు రూ. 9.50 లక్షలు, క్యాంటీన్‌కు రూ. 9.12 లక్షలు, మరుగుదొడ్లకు రూ. 7.20 లక్షలకు సుంకన్న దక్కించుకున్నాడు. గత ఏడాది నిర్వహించిన వేలంలో రూ. 1,76,81,000 ఆదాయం రాగా, ఈ ఏడాది రూ. 1,47,01,000 అదనంగా వచ్చినట్లు ఆలయ అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఈవో పురేందర్ కుమార్, చైర్మన్ కొంకల నాగేశ్వర్‌రెడ్డి, ఆలయ ధర్మకర్తలు, ప్రధాన అర్చకులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీపీవో పార్థసారథి

పారిశుధ్యలోపం తలెత్తకుండా చర్యలు

» డీపీవో పార్థసారథి

చిన్నచింతకుంట, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : కురుమూర్తి బ్రహ్మోత్సవాలు, జాతర సందర్భంగా పారిశుధ్య లోపం లేకుండా అధికారులు పకడ్బందీ చర్యలు తీసుకోవాలని జిల్లా పంచాయతీ అధికారి పార్థసారధి అన్నారు. మహబూబ్ నగర్ జిల్లా, చిన్నచింతకుంట మండలం, కురుమూర్తి వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలపై శుక్రవారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. పంచాయతీ కార్యదర్శులు వారికి కేటాయించిన విధులను సక్రమంగా నిర్వర్తించాలన్నారు. కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయాలని దేవాదాయ శాఖాధికారులకు సూచించారు. సమావేశంలో డివిజినల్ పంచాయతీ అధికారి నసీరుద్దీన్, ఎంపీడీవోలు సుధాకర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీవోలు అనిల్‌కుమార్, శ్రీనివాస్‌రెడ్డి, విజయ్‌కుమార్, శంకర్‌నాయక్, జగదీష్ పాల్గొన్నారు.

నేడు పాలకవర్గం ప్రమాణ స్వీకారం

కురుమూర్తి వెంకటేశ్వరస్వామి ఆలయ కమిటీ నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకారోత్సవం శనివారం ఆలయ ప్రాంగణంలో నిర్వహించనున్నారు. దీనికి ముఖ్య అతిథిగా దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి హాజరుకానున్నారని ఈవో మదనేశ్వర్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పాలకవర్గంతో పాటు చైర్మన్ కూడా ప్రమాణ స్వీకారం చేయనున్నట్లు పేర్కొన్నారు.

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలి

● ఎంఈవో మురళీధర్‌రెడ్డి



మాగనూరు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులు పాఠశాలలకు సమయానికి చేరుకునేలా చూస్తానని, సమయపాలన పాటించని వారిపై చర్యలు తీసుకుంటామని ఎంఈవో మురళీధర్‌రెడ్డి హెచ్చరించారు. శుక్రవారం ఆయన 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు.

మండలానికి ఎంత మంది ఉపాధ్యాయులు వచ్చారు?

21 మంది ఉపాధ్యాయులు వచ్చారు. ఎస్జీటీ ఆరుగురు, ఎస్‌ఏ సోషల్, ఎల్‌పీ తెలుగు, ఎస్‌ఏ బయోసైన్స్, గణితం, ఎస్‌ఏ తెలుగు, ఇతరులు ఒక్కొక్కరు చొప్పున వచ్చారు.

మండలంలో ఎంతమంది ఉపాధ్యాయులు పని చేస్తున్నారు?

98 మంది పని చేస్తున్నారు.

చాలా పాఠశాలల్లో వంటగదులు శిథిలావస్థలో ఉన్నాయి కదా?

శిథిలావస్థకు చేరిన వాటిపై ప్రభుత్వానికి నివేదికలు పంపిస్తాం.

పదో తరగతి పరీక్షల్లో విద్యార్థుల ఉత్తీర్ణత శాతం పెంచేందుకు ఏం చేస్తున్నారు?

వంద శాతం ఉత్తీర్ణతకు కృషి చేస్తున్నాం. విద్యార్థులకు ప్రత్యేక తరగతులు కొనసాగిస్తాం.

చలో హైదరాబాద్‌కు తరలిన మునిసిపల్ కార్మికులు

నారాయణపేట న్యూటౌన్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): తమకు రూ.26 వేలు వేతనం ఇచ్చి పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం హైదరాబాద్‌లోని సీడీఎంఏ కార్యాలయం వద్ద జరిగే మహాధర్నాకు మునిసిపల్ ఔట్ సోర్సింగ్ కార్మికులు తరలివెళ్లారు. నారాయణపేట అంబేడ్కర్ చౌరస్తాలో వాహనాల శ్రేణికి సీఐటీయూ జిల్లా కార్యదర్శి బాల్‌రామ్ జెండా ఊపి కార్మికులను పంపించారు.

కోస్గి బల్దియాకు నిధుల వరద

- ముఖ్యమంత్రి ప్రత్యేక చొరవతో నిధులు మంజూరు
- ప్రస్తుతం రూ.48 కోట్లు విడుదల
- త్వరలో వార్డుల వారీగా పనులు ప్రారంభం



కోస్గి బల్దియా

కోస్గి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): కోస్గి బల్దియాకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రత్యేక చొరవతో నిధుల వరద మొదలైంది. బల్దియాలోని 16 వార్డుల అభివృద్ధికి మొదట రూ.48 కోట్లు మంజూరు చేశారు. ప్రతీ వార్డులో డ్రైనేజీల నిర్మాణం, సీసీ రోడ్లు, వీధి దీపాలు, పార్కుల ఏర్పాటుకు అధికారులు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. మొదటగా ప్రతీ వార్డులో అత్యవసరమున్న పనులకు ఎస్టిమేట్ వేసి టెండర్ ప్రక్రియ చేస్తున్నారు. ఇందులో భాగంగానే శివాజీ కూడలి నుంచి ఇంజనీరింగ్ కళాశాల వరకు రోడ్డు వెంట సెంట్రల్ లైటింగ్, అదేవిధంగా శివాజీ కూడలి నుంచి ప్రభుత్వ ఆసుపత్రి వరకు లైటింగ్ ఏర్పాటు, పార్కుల పనులకు శ్రీకారం చుట్టారు. కాగా పట్టణంలోని 16 వార్డుల్లో డ్రైనేజీలు అస్తవ్యస్తంగా ఉండటంతో వార్డుల వారీగా అధికారులు డ్రైనేజీ, సీసీ రోడ్లకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు. ముఖ్యంగా పాఠశాల భవనాలు, అంగన్‌వాడీ శాశ్వత భవనాలతో పాటు ప్రత్యేకంగా కొడంగల్ నియోజకవర్గానికి మరో రూ.60 కోట్లు మంజూరయ్యాయి. దీంతో ప్రతీ ప్రభుత్వ పాఠశాల అభివృద్ధి చెందనుంది. నిధులతో అదనపు తరగతి గదులు, ప్రహరీ నిర్మాణాలు కూడా చేపట్టను న్నారు. ప్రస్తుతం కొడంగల్‌కు నిధుల వరద మొదలైంది.

కోస్గిపై ముఖ్యమంత్రి ప్రత్యేక దృష్టి పెట్టారు..



ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కోస్గి బల్దియాపై ప్రత్యేక దృష్టి పెట్టారు. ఇప్పటి వరకు బల్దియా అభివృద్ధికి రూ.48 కోట్లు అందించారు. త్వరలో మరిన్ని నిధులు రానున్నాయి. నిధులతో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీలు, మురికినీరు చెరువుల్లోకి చేరకుండా శుద్ధి చేసేందుకు ఎస్‌టీటీ (సెవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్) ఏర్పాటు చేయనున్నారు.

- బెజ్జు రాములు, మునిసిపల్ అధ్యక్షుడు

మొదటగా అత్యవసరమైన పనులకు ఎస్టిమేట్ వేస్తున్నాం..



కోస్గి బల్దియాలోని 16 వార్డుల్లో మొదటగా అత్యవసర పనులకు స్థానిక కౌన్సిలర్లను సంప్రదించి ఎస్టిమేట్ వేస్తున్నాం. పట్టణంలో సెంట్రల్ లైటింగ్ కూడా ఏర్పాటు చేస్తున్నాం.

- నాగరాజు, కమిషనర్

డిజిటల్ పంటల సర్వేకు ఏఈవోల శ్రీకారం


సింగారం శివారులో వరి పంటను సర్వే చేస్తున్న ఏఈవో అనిల్‌కుమార్

నారాయణపేట, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): పంటల డిజిటల్ సర్వేకు వ్యవసాయ విస్తరణ అధికారులు(ఏఈవో) తాజాగా శ్రీకారం చుట్టారు. సమస్యలకు పరిష్కారం లభించకపోవడంతో నెలరోజులుగా సర్వేకు దూరంగా ఉన్న ఏఈవోలు వ్యవసాయ సంచాలకుల హామీతో వారంరోజుల పాటు డిజిటల్ సర్వే కోసం ఈనెల 16 నుంచి పంటల బాట పట్టారు. యాప్‌లో పంటల నమోదు సర్వేకు అధిక పని ఒత్తిడితో పాటు, క్షేత్ర స్థాయిలో ప్రాణాపాయ పరిస్థితులతో మహిళా ఏఈవోలకు భద్రత కొరవడిందని, సర్వేకు వీవోఏలను నియమించాలని డిమాండ్ చేస్తున్న సంగతి తెలిసిందే. జిల్లాలో 76 క్లస్టర్స్‌కు గాను 67 మంది పనిచేస్తుండగా అందులో 16మంది ఔట్‌సోర్సింగ్ సిబ్బంది ఉన్నారు. తొమ్మిది ఏఈవో పోస్టులు ఖాళీగా ఉండడంతో పక్క మండలాల ఏఈవోలకు అదనపు బాధ్యతలు అప్పగించారు. ఏడేళ్లుగా ఎలాంటి సదుపాయాలు లేకున్నా వ్యవసాయ శాఖలో 49 రకాల పనులు చేస్తూ తీవ్ర పనిభారంతో ఒత్తిడికి గురవుతున్నట్లు వారు వాపోతున్నారు. తమ సమస్యలకు ప్రభుత్వం పరిష్కారం చూపకపోతే మళ్లీ వారంరోజుల అనంతరం ఐక్య కార్యాచరణతో ముందుకెళ్తామని వారు పేర్కొన్నారు.

కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ


చెక్కులు పంపిణీ అనంతరం లబ్ధిదారులతో ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి

మరికల్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని జిన్నారం, ఎక్లాస్‌పూర్, కన్మనూర్, చిత్తనూర్, బుడ్డగానితండా గ్రామాల లబ్ధిదారులకు శుక్రవారం మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రజా పాలనలో లబ్ధిదారులందరికి సంక్షేమ పథకాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. అన్ని రంగాల్లో మహిళలను అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నామన్నారు. గత పదేళ్ల అధికారంలో ఉండి ఏమీ చేయలేని వారు కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక దిగజారుడు ఆరోపణలు చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు ప్రశాంత్‌కుమార్‌రెడ్డి, నంగి దేవేందర్ రెడ్డి, తహసీల్దార్ జమీల్, ఎంపీడీవో కొండన్న, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి

కోస్గి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ప్రతీ ఒక్కరు పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని అందులో భాగంగానే ప్రతీ శుక్రవారం కోస్గి మునిసిపాలిటీలో పరిసరాల పరిశుభ్రత కోసం డ్రైడే నిర్వహిస్తున్నామని కమిషనర్ నాగరాజు అన్నారు. శుక్రవారం మునిసిపాలిటీలోని 16వ వార్డులో డ్రైడేను నిర్వహించారు. వార్డులో ప్రతీ ఒక్కరు తమ పరిసరాలు శుభ్రంగా ఉంచుకుంటే దోమలు రావని.. తద్వారా డెంగీ, మలేరియా వంటి వ్యాధులు వ్యాప్తి చెందవని అన్నారు. ప్రతీ ఇంటికి వెళ్లి ప్రజలకు అవగాహన కల్పించారు. ఇళ్లల్లో నీటి నిల్వ ఉండకూడదన్నారు. కార్యక్రమంలో మేనేజర్ యాదయ్య వార్డు అధికారి కవిత తదితరులున్నారు.

పశువులకు గాలికుంటు టీకాలు వేయించాలి

- పశువైద్యాధికారి డాక్టర్ ఈశ్వర్‌రెడ్డి

నారాయణపేటరూరల్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): పశువులకు గాలికుంటు వ్యాధి నివారణకు గాను టీకాలు వేయించాలని జిల్లా పశు వైద్యాధికారి డాక్టర్ ఈశ్వర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని శేర్నపల్లి గ్రామంలో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను వేశారు. గ్రామంలో మొత్తం 253 పశువులకు టీకాలను వేశారు. కార్యక్రమంలో మండల పశువైద్యాధికారి డా.అనిరుద్ధాచార్య, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

పెండింగ్ స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలి

- ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో తహసీల్దార్‌కు వినతి


తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

నారాయణపేటరూరల్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల పెండింగ్ స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో శుక్రవారం పేట తహసీల్దార్ అమరేంద్రకృష్ణకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా కార్యదర్శి నరహరి మాట్లాడుతూ రాష్ట్రంలో గత ఐదేళ్లుగా పెండింగ్‌లో ఉన్న రూ.8300 కోట్ల స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలన్నారు. స్కాలర్‌షిప్‌తో సంబంధం లేకుండా చదువు పూర్తిచేసిన విద్యార్థులకు సర్టిఫికెట్‌లు ఇవ్వాలన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ గురుకులాలకు సొంత భవనాలు నిర్మించాలని, ప్రైవేట్ విద్యా సంస్థల దోపిడీని అరికట్టాలని డిమాండ్ చేశారు. ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా నాయకులు పవన్‌కుమార్, భానుప్రకాశ్, నవీన్, శివకుమార్ పాల్గొన్నారు.

సీపీఎం జిల్లా మహాసభలు జయప్రదం చేయాలి

దామరగిద్ద, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): మక్తల్ పట్టణంలో నవంబర్ 3, 4 తేదీల్లో జరిగే సీపీఎం జిల్లా రెండవ మహాసభలను విజయవంతం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు గోపాల్ అన్నారు. గురువారం మండల పరిధిలోని సజనాపూర్ గ్రామంలో మహాసభల కరపత్రం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మక్తల్ పట్టణంలో జరిగే సీపీఎం మహాసభల్లో జిల్లా సమగ్రాభివృద్ధి కోసం, భవిష్యత్ పోరాటాలు, మతోన్మాద వ్యతిరేక పోరాటాలు రూపొందించుకోవడం జరుగుతుందన్నారు. ఇట్టి మహాసభలకు జిల్లా ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో మండల నాయకులు జోషి, షేర్‌ఖాన్, తిప్పన్న, నరసింహ్మా, గురునాథ్‌లు పాల్గొన్నారు.

సీపీఆర్‌పై అవగాహన


సీపీఆర్ చేస్తున్న కలెక్టర్

నారాయణపేట టౌన్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): సీపీఆర్ శిక్షణను సద్వినియోగం చేసుకుంటే గుండెపోటుకు గురైన వారిని ప్రాణాపాయ స్థితి నుంచి కొంతవరకు కాపాడవచ్చునని కలెక్టర్ సిక్తా పట్నాయక్, లైఫ్ సేవర్ అసోసియేషన్ ఢిల్లీ వైద్య నిపుణులు డాక్టర్ రాకేష్, అనిల్ మిశ్రాలు పేర్కొన్నారు. శుక్రవారం సింగారం స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రంలో సీపీఆర్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఒక వ్యక్తికి గుండె కొట్టుకోవడం స్తంభించడం లేదా ఊపిరితిత్తులు శ్వాస తీసుకోని స్థితిలో ఉంటే అలాంటి వారికి సీపీఆర్ చేయాలన్నారు. అనంతరం బొమ్మల ద్వారా సీపీఆర్ ఎలా చేయాలో వివరించారు. కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ గరీమా నరుల, మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాంకిషన్, లైఫ్ సేవర్ అసోసియేషన్ ఢిల్లీ వైద్య నిపుణులు పాల్గొన్నారు.

చెరువుల్లో చేప పిల్లలు విడుదల


కొండాపూర్‌లోని చెరువులో చేప పిల్లలను వదులుతున్న అధికారులు

ధన్వాడ, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ధన్వాడ మండలం కొండాపూర్, కిష్టాపూర్ గ్రామాల్లోని చెరువుల్లో శుక్రవారం మత్స్యశాఖ ఆధ్వర్యంలో చేప పిల్లలను వదిలారు. నారాయణపేట మార్కెట్ యార్డు చైర్మన్ సదాశివరెడ్డి, వైస్ చైర్మన్ కొనంగేరి హన్మంతు, మత్స్యశాఖ జిల్లా అధ్యక్షుడు కాంతు ముదిరాజ్, ఉపాధ్యక్షుడు నీరటి నర్సిములునాయుడు చెరువులో ప్రత్యేక పూజలు నిర్వహించి, చేప పిల్లలను వదిలారు. ఎంపీడీవో సాయిప్రకాష్, మార్కెట్ యార్డు డైరెక్టర్లు నీరటి రాంచంద్రయ్య ముదిరాజ్, జట్రం లక్ష్మయ్యగౌడ్, చీరాల సుధాకర్‌రెడ్డి తదితరులున్నారు.

పోలీసు సిబ్బందికి వ్యాసరచన పోటీలు


పరీక్షలు పర్యవేక్షిస్తున్న అదనపు ఎస్పీ

నారాయణపేట, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం పోలీస్ సిబ్బందికి వ్యాస రచన పోటీలు నిర్వహించారు. 'సమాజంలో పోలీసులు పాత్ర' అనే అంశంపై స్థానిక ఎస్పీ కార్యాలయ ఆవరణలో పరీక్షలు నిర్వహించారు. పరీక్షలను అదనపు ఎస్పీ రియాజ్ పర్యవేక్షించారు. ఆర్‌ఐ నరసింహ తదితరులున్నారు.

'మాట్లాడే పద్ధతి మీ సీఎంకు నేర్పించండి'

మక్తల్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ప్రజాక్షేత్రంలో మాట్లాడే పద్ధతి మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డికి కాదని.. నేర్పించాల్సింది ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి అని బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు చిన్న హన్మంతు, కౌన్సిలర్లు అన్వర్‌హుసేన్, జగ్గలి రాములు, మొగిలప్పలు అన్నారు. శుక్రవారం వారు పట్టణంలోని మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి ఇంటి వద్ద విలేకరుల సమావేశం నిర్వహించి, మాట్లాడారు. ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డిపై చేసిన వ్యాఖ్యలను ఖండించారు. 18 ఏళ్ల నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసిన విషయం మీకు చెప్పాల్సిన అవసరం లేదని.. ప్రజలకు తెలుసు అన్నారు. సంగంబండ, భూత్పూర్ రిజర్వాయర్లు పూర్తి చేసి నియోజకవర్గంలో 1.50 లక్షల ఎకరాలకు సాగునీరందించిన ఘనత చిట్టెం రామ్మోహన్‌రెడ్డిది అన్నారు. బీఆర్‌ఎస్ హయాంలోనే డిగ్రీ కళాశాల, మున్సిఫ్ కోర్టు, 150 పడకల ఆసుపత్రి, కృష్ణలో పీహెచ్‌సీ, సంగంబండ నిర్వాసితులకు నిధులు మంజూరు చేయిస్తే ప్రస్తుత ఎమ్మెల్యే తానే చేయించినట్లు చెప్పుకోవడం విడ్డూరమన్నారు. మీ సవాల్‌ను స్వీకరిస్తున్నామని ఏ చర్చకైనా సిద్ధమే అన్నారు. తాటాకు చప్పుళ్లకు భయపడే ప్రసక్తే లేదన్నారు. సమావేశంలో బీఆర్‌ఎస్ నాయకులు జుట్ల శంకర్, నర్సింహారెడ్డి, మన్నాన్, శివారెడ్డి, అశోక్‌గౌడ్ తదితరులున్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం


బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం అందిస్తున్న పూర్వ విద్యార్థులు

మాగనూరు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన రమేష్ వారంరోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పదో తరగతి 2004 బ్యాచ్ విద్యార్థులు మృతుడి భార్యకు రూ.50వేల ఆర్థిక సహాయం అందించారు. రమేష్ అకాల మృతి బాధాకరమని స్నేహితులు విచారం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో భీంరాజ్, వెంకటేష్, శ్యామలప్ప, నారాయణ, వెంకటేష్ తదితరులున్నారు.

చేనేత కార్మికుల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం



మాట్లాడుతున్న చేనేత ఏడీ బాబు

నారాయణపేట, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఉన్న చేనేత కార్మికుల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని మునిసిపల్ చైర్‌పర్సన్ గందె అనసూయ, వైస్ చైర్మన్ హరినారాయణ భట్టడ్, మార్కెట్ చైర్మన్ శివారెడ్డిలు అన్నారు. శుక్రవారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో చేనేత జౌళిశాఖ ఆధ్వర్యంలో చేనేత కార్మికులకు చెక్కులను పంపిణీ చేసి ప్రసంగించారు. ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి చొరవతో గత ప్రభుత్వంలో పెండింగ్‌లో ఉన్న చేయూత పథకం ద్వారా ప్రభుత్వం నుంచి రూ.ఎనిమిది కోట్ల నిధులు చేనేత కార్మికులకు మంజూరు చేయించామన్నారు. త్వరలో చేనేత కార్మికుల రుణాలను ప్రభుత్వం మాఫీ చేస్తుందన్నారు. ఇందిరమ్మ ఇళ్లల్లో చేనేత కార్మికులకు ప్రాముఖ్యత కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కోనంగేరి హన్మంతు, కౌన్సిలర్ సలీం, చేనేత జౌళిశాఖ ఏడీ బాబు, ముదిరాజ్ సంఘం జిల్లా అధ్యక్షుడు సరాఫ్ నాగరాజు, మారుతీ, శంకర్, అంబు, చిట్టెం రాఘవేంద్రరెడ్డి ఉన్నారు.

అధికార దుర్వినియోగంపై విచారణ చేపట్టాలి

నారాయణపేట, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో 2022, 2023 సంవత్సరంలో బాలల సంరక్షణ జిల్లా అధికారిగా పనిచేసిన కుసుమలత అధికార దుర్వినియోగంపై సమగ్ర విచారణ జరిపించాలని శుక్రవారం కలెక్టరేట్‌లో ఏవో జయసుధకు ప్రజా సంఘాల నాయకులు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి నరహరి మాట్లాడుతూ గతంలో డీసీపీవోగా పనిచేసిన ఆమె జిల్లా బాలల సంరక్షణ అధికారిగా కొనసాగుతూ పది రోజులకోసారి విధులకు హాజరయ్యారని ఆరోపించారు. డీడబ్ల్యూవో వేణుగోపాల్ సహకారంతో నెల మొత్తం వేతనం పొందిందని ఆమెపై సమగ్రంగా విచారణ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి బాల్‌రామ్, గోపాల్, వెంకటేష్ తదితరులున్నారు.

ఎన్‌సీసీ విద్యార్థులకు రక్త పరీక్షలు


బాలుర ఉన్నత పాఠశాలలో ఎన్‌సీసీ విద్యార్థులకు రక్త పరీక్ష చేస్తున్న సిబ్బంది

ఊట్కూర్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో ఎన్‌సీసీ విద్యార్థులకు శుక్రవారం రక్త పరీక్షలు నిర్వహించారు. ఊట్కూర్ ఆసుపత్రి సిబ్బంది ఆధ్వర్యంలో ఎంపీహెచ్‌ఎం విజయ్‌కుమార్, ల్యాబ్ టెక్నీషియన్ నరేష్, ఆరోగ్య కార్యకర్త గోవిందమ్మలు విద్యార్థుల నుంచి రక్త సేకరణ చేశారు. ఈ సందర్భంగా ఎంపీహెచ్‌వో విజయ్‌కుమార్ మాట్లాడుతూ విద్యార్థులకు ఏదైనా ప్రమాదం జరిగి రక్తం అవసరమైనప్పుడు ఏ రక్తం ఇవ్వాలో పరీక్ష ద్వారా తెలుస్తుందన్నారు. కార్యక్రమంలో పర్యవేక్షకులు నర్సిములు, ఆశ కార్యకర్త పుష్ప, హెచ్‌ఎం కుసుమారెడ్డి, ఉపాధ్యాయులు, ఎన్‌సీసీ విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ధర ప్రకారం పత్తి కొనుగోలు చేయాలి

మక్తల్‌రూరల్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం నిర్ణయించిన ధర ప్రకారం పత్తి కొనుగోలు చేయాలని బీజేపీ రాష్ట్ర నాయకుడు లక్ష్మీకాంత్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మక్తల్ మండలం గుడిగండ్ల గ్రామ శివారులో శ్రీలక్ష్మీ దుర్గ ఆంజనేయ కాటన్‌మిల్లు వద్ద పత్తి కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. రైతులను ఆదుకోవాలని వ్యవసాయ, సీసీఐ అధికారులను కోరారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

ఊట్కూర్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ఎన్నో ఏళ్లుగా అపరిష్కృతంగా ఉన్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని తపస్ మండల అధ్యక్షుడు కృష్ణ డిమాండ్ చేశారు. తపస్ సభ్యత్వం అభియాన్‌లో భాగంగా శుక్రవారం మండలంలోని సమిస్తాపూర్, కొల్లూర్, యడవెల్లి, చిన్నపొర్ల, పెద్దపొర్ల, మల్లెపల్లి, నాగిరెడ్డిపల్లి, పులిమామిడి, అవుసులోన్‌పల్లి, మగ్దూంపూర్, ఎర్రగట్‌పల్లి, బాపూర్ గ్రామాల్లోని పాఠశాలల్లో నూతన ఉపాధ్యాయులతో సంఘం సభ్యత్వం నిర్వహించారు. కార్యక్రమంలో గౌరవ అధ్యక్షుడు రామచంద్రయ్య, ప్రధాన కార్యదర్శి గోపాల్, మండల నాయకులు, ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కాలి నడకతో కూలీల కష్టాలు


పేట శివారు నుంచి కాలినడకన కూలీల అవస్థలు

నారాయణపేట, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): పత్తి ఏరేందుకు ఆటోలు, బొలెరో వాహనాల్లో వచ్చిన కూలీలకు శుక్రవారం చుక్కెదురైంది. తిప్రస్‌పల్లి, సింగారం, అప్పక్‌పల్లి తదితర ప్రాంతాలకు ప్రైవేటు వాహనాల్లో వచ్చిన కూలీలు సాయంత్రం స్వగ్రామాలకు అదే వాహనాల్లో వెళ్తుండగా పేట శివారులో ఆర్టీవో తనిఖీ చేస్తున్నారని వాహనాలను నక్కలకాలనీ రోడ్‌లోనే నిలిపివేశారు. దీంతో చేసేది లేక మహిళా కూలీలు కిలో మీటర్ మేర పేటకు నడుస్తూ ఇలా కన్పించారు.

'ప్రతీ ఇంట్లో బీజేపీ సభ్యత్వం ఉండాలి'

మరికల్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): దేశ అభివృద్ధి, దేశ రక్షణ, సనాతన ధర్మ పరిరక్షణ కోసం ప్రతీ ఇంట్లో బీజేపీ సభ్యత్వం ఉండాలని ఆ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి చిన్ననర్సన్‌గౌడ్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని పసుపుల గ్రామంలో నిర్వహించిన పార్టీ సభ్యత్వ నమోదులో ఆయన మాట్లాడారు. అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందన్నారు. కార్యక్రమంలో వేణు, రమేష్, శెట్టి మహేందర్, నరేష్‌గౌడ్, రాజేశ్, వెంకటేశ్, శ్రీరామ్, గ్రామస్థులు పాల్గొన్నారు.

అన్నదానానికి బియ్యం అందజేత

కృష్ణ, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): కర్ణాటక, మహారాష్ట్ర సరిహద్దున ఉన్న హులిజయంతి మాళింగారాయ జాతర మహోత్సవాల్లో అన్నదానానికి గాను మండలంలోని కుర్వ సంఘం నాయకులు 30 క్వింటాళ్ల బియ్యం, ఐదు క్వింటాళ్ల బెల్లం, ఐదు క్వింటాళ్ల రవ్వను శుక్రవారం ప్రత్యేక వాహనంలో తరలించారు. కుర్వ కులస్తుల ఆరాధ్య దైవం అయినటువంటి మాళింగారాయ జాతర సందర్భంగా అక్కడ జరిగే అన్నదానానికి ఈ ప్రాంతం నుంచి ప్రతి ఏటా బియ్యం, ఇతరత్రా సరుకులను తరలిస్తున్నట్లు సంఘం జిల్లా అధ్యక్షుడు నాగరాజు తెలిపారు. అంతకుముందు సంఘం నాయకులు కనకదాస్ విగ్రహానికి పూజలు చేశారు. నాయకులు మహాలింగ, పెద్దమలింగా, సురేష్‌కుమార్, మాజీ ఉప సర్పంచు బాలరాజు ఉన్నారు.

గోవింద నామావళికి బయలుదేరిన మహిళలు


తిరుమలకు బయలుదేరుతున్న మహిళలు

నారాయణపేట న్యూటౌన్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో రెండు రోజులు జరిగే గోవింద నామావళి కార్యక్రమానికి నారాయణపేట నుంచి శుక్రవారం బీజేపీ మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు లక్ష్మీశాంసుందర్ గౌడ్ ఆధ్వర్యంలో 40 మంది మహిళలు తిరుమలకు బయలుదేరి వెళ్లారు. తిరుమలలో జాతీయ ఆధ్యాత్మిక సదస్సు సందర్భంగా 26, 27 తేదీల్లో తిరుమల తిరుపతి దేవస్థానంలో గోవింద నామావళి నిర్వహిస్తున్నారన్నారు.

బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులుకు ఘనంగా వీడ్కోలు


బదిలీపై వెళ్తున్న ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు

మక్తల్‌రూరల్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): మక్తల్ మండలంలోని కర్ని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల నుంచి ఇతర పాఠశాలలకు బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులకు శుక్రవారం విద్యార్థులు, ఉపాధ్యాయులు, గ్రామస్థులు ఘనంగా వీడ్కోలు పలికారు. బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులు అశోక్‌కుమార్, శ్రీలత, తిరుమల, శ్వేతలను జీహెచ్‌ఎం వెంకటయ్యగౌడ్, హెచ్‌ఎం జి.రమేష్ ఆధ్వర్యంలో పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించి, వీడ్కోలు పలికారు. గత పదేళ్ల కాలంలో పాఠశాలతో, విద్యార్థులతో, గ్రామంతో తమకున్న ప్రత్యేక అనుబంధాన్ని మరోసారి గుర్తు చేసుకుని ఉపాధ్యాయులంతా కన్నీటి పర్యంతమయ్యారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు డి.వెంకటేష్, మారుతి, ప్రతిభ, రమ్య, కల్పన, ఆశాజ్యోతి తదితరులున్నారు.